andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 35.6 । కనిష్ఠం 27.4
నిర్మల్ జిల్లా వార్తలు
8
ఆదివారం 1 జూన్ 2025





ఆయిల్‌పామ్ పరిశ్రమపై నీలినీడలు!

- జిల్లాలో నిర్మాణ స్థలంపై ఇరిగేషన్ శాఖ అభ్యంతరాలు
- గోదావరి పరివాహక ప్రాంతంలో ఉందంటూ అడ్డంకులు
- చేతికొచ్చిన మొదటి దశ పంట
- ప్రాథమికంగా కొనుగోళ్లను చేపట్టిన కంపెనీ యాజమాన్యం

దిగుబడి వచ్చిన ఆయిల్ పామ్ పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి (ఫైల్)

నిర్మల్, మే 31 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో నిర్మించతలపెట్టిన ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ నిర్మాణానికి ఇరిగేషన్‌శాఖ సాంకేతిక కారణాల పేరిట అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో.. ఆ పరిశ్రమ నిర్మాణంపై నీలినీడలు కమ్ముకున్నాయి. జిల్లాలోని సోన్ మండలం పాక్‌పట్ల గ్రామం వద్ద ఫ్యాక్టరీని నిర్మించే స్థలం గోదావరి పరివాహక ప్రాంతానికి సంబంధించి ఫ్లడ్ లెవెల్ పరిధిలో ఉన్నందు వల్ల ఇరిగేషన్ శాఖాధికారులు ఈ ఫ్యాక్టరీ నిర్మాణానికి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ జారీ చేయడం లేదు. ఇప్పటికే ఈ ఫ్యాక్టరీకి పొల్యూషన్ బోర్డ్‌తో పాటు ఇతర అన్ని రకాల అనుమతులు లభించినప్పటికీ.. ఇరిగేషన్‌శాఖ నుంచి మాత్రం అనుమతి జారీ కాలేదు. దీంతో ఏడాదిన్నరగా ఈ పరిశ్రమ పనులు మొదలు కావడం లేదు. గోదావరి నది ఫ్లడ్‌లెవెల్ పరిధిలో పరిశ్రమ నిర్మాణ స్థలం ఉన్న కారణంగా ఇక భవిష్యత్తులో కూడా ఈ పరిశ్రమకు ఇరిగేషన్ శాఖ నుంచి ఎన్‌వోసీ జారీ కావడం సాధ్యం కాదు. దీంతో ఈ పరిశ్రమ యాజమాన్యమైన ప్రీ యూనిక్ కంపెనీ ప్రత్యామ్నాయ స్థల అన్వేషణలో ఉన్నట్లు సమాచారం. జిల్లాలో స్థలం లభించినట్లయితే సరిహద్దులో ఉన్న నిజామాబాద్ జిల్లాలో ఈ పరిశ్రమను ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు అధికార వర్గాలు చెబుతున్నారు. అయితే ప్రస్తుతం మొదటి దశలో సాగు చేసిన ఆయిల్‌పామ్ పంట దిగుబడులు చేతికొచ్చాయి. దీంతో ఈ పంటను ప్రీ యూనిక్ కంపెనీ కొనుగోలు చేసేందుకు సిద్ధమైంది. ఇందులో భాగంగానే జిల్లాలోని దిలావర్‌పూర్, లోకేశ్వరం మండల కేంద్రాల్లో రెండు రోజుల క్రితం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించింది. అలాగే మరో ఎనిమిది చోట్ల కూడా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించేందుకు సిద్ధమవుతోంది. కొనుగోలు చేసిన ఆయిల్ పామ్ పంటను ఖమ్మం జిల్లాలోని అశ్వరావుపేట ఫ్యాక్టరీకి తరలించనున్నారు.

● చేతికొచ్చిన మొదటి దశ దిగుబడి

మొదటి దశ కింద నిర్మల్ జిల్లాలో మొత్తం 1335 ఎకరాలలో ఆయిల్ పామ్ పంట దిగుబడి రానుంది. ఒక ఎకరానికి రెండు టన్నుల వరకు దిగుబడి వస్తుందని అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఇప్పటికే దాదాపు 50 ఎకరాలకు సంబంధించిన పంట కొనుగోళ్లు పూర్తయిందని అధికారులు వివరిస్తున్నారు. టన్ను ఆయిల్ పామ్ గెలలకు 20 వేల రూపాయలను సదరు ప్రీ యూనిక్ కంపెనీ రైతులకు చెల్లిస్తుంది. ప్రస్తుతం ప్రీ యూనిక్ కంపెనీ ఆధ్వర్యంలోనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. పంటను విక్రయించిన రైతులకు వారం నుంచి పది రోజుల లోపల డబ్బులను చెల్లించనున్నట్లు హార్టికల్చర్ శాఖ అధికారులు చెబుతున్నారు.

● కొనుగోలు చేసిన పంట తరలింపుకు చర్యలు

నిర్మల్‌లో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ నిర్మాణం పనులు మొదలు కాక పోవడంతో ఇక్కడ కొనుగోలు చేస్తున్న ఆయిల్ పామ్ గెలలను సంబంధిత కంపెనీ ప్రతినిధులు ఖమ్మం జిల్లాలోని అశ్వరావుపేట ఫ్యాక్టరీకి మిల్లింగ్ కోసం తరలించనున్నారు. మొదటిదశకు సంబంధించిన పంటను డిసెంబరు నెలాఖరు వరకు కొనుగోలు చేయాలని ప్రీ యూనిక్ యాజమాన్యం నిర్ణయించింది. కాగా.. ఆయిల్ పామ్ రైతులందరికీ కంపెనీ నుంచి ప్రత్యేక ఐడెంటిటీ కార్డును కూడా జారీ చేస్తున్నారు. ఈ కార్డు కలిగి ఉన్న రైతులకు ఉద్యానవన శాఖ ద్వారానే కాకుండా ప్రీ యూనిక్ కంపెనీ ద్వారా అన్ని రకాల ప్రయోజనాలు అందించనున్నారు. ఈ పంటను సాగు చేస్తున్న ఒక్కో రైతుకు ప్రత్యేక ఐడీ నెంబర్‌ను కూడా కంపెనీ కేటాయించింది.

● ఫ్యాక్టరీ నిర్మాణానికి ప్రత్యామ్నాయ అన్వేషణ

ప్రస్తుతం ఫ్యాక్టరీ నిర్మించతలపెట్టిన పాక్‌పట్ల గ్రామ స్థలం గోదావరి పరివాహక ప్రాంతంలో ఉన్నట్లు అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఫ్యాక్టరీ నిర్మాణానికి మొదట్లో ప్రభుత్వం స్థలం కేటాయించింది. దీంతో పొల్యూషన్ బోర్డ్ అలాగే పరిశ్రమల శాఖ నుంచి ఫ్యాక్టరీ నిర్మాణానికి అనుమతులు లభించాయి. ఈ అనుమతులు లభించడంతో.. అప్పటి పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ ఈ ఫ్యాక్టరీ నిర్మాణానికి శంకుస్థాపన కూడా చేశారు. అయితే ఫ్యాక్టరీ నిర్మాణ స్థలం నది పరివాహక ప్రాంతంలో ఉన్నట్లు ఫిర్యాదులు రావడంతో.. ఇరిగేషన్ శాఖ ఈ స్థలంపై సర్వే చేపట్టింది. తమ వద్ద ఉన్న రికార్డుల ఆధారంగా ఈ స్థలం గోదావరి నది ఫ్లడ్ లెవెల్ పరిధిలో ఉన్నట్లు గుర్తించారు. దీంతో ఆ శాఖ ఎన్‌వోసీని జారీ చేయలేదు. అలాగే ఈ ప్రాంతంలో పరిశ్రమను నిర్మించవద్దంటూ కూడా కంపెనీ యాజమాన్యానికి నోటీసులు జారీ చేసింది. కాగా.. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా మూడు దశల వారీగా దాదాపు 10వేల ఎకరాల్లో ఆయిల్ పామ్ పంట సాగు కొనసాగుతోంది. ఇందులో భాగంగానే మొదటి దశ కింద 1350 ఎకరాలలో సాగు చేసిన పంట దిగుబడి ఇప్పటికే చేతికొస్తుంది. పంట దిగుబడులు మొదలు కావడంతో జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ప్రీ యూనిక్ కంపెనీ యాజమాన్యం ప్రాథమికంగా రెండు చోట్ల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించింది. మరో ఎనిమిది చోట్ల కూడా ఈ కేంద్రాలను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తోంది.

భక్తి, శ్రద్ధలతో

తురాటిలో మృత్యుంజయ హోమం



మృత్యుంజయ హోమం నిర్వహిస్తున్న దృశ్యం

నర్సాపూర్(జి), మే 31 (ఆంధ్రజ్యోతి) : మృత్యుంజయ హోమం హిందూ ధర్మంలో ఒక ముఖ్యమైనది, పవిత్రమైనదని అని వేద పండితులు సదాశివశర్మ అన్నారు. మండలంలోని తురాటి గ్రామంలో ఉదయం 9 గంటలకు ప్రారంభించిన యాగం సాయంత్రం ఐదు గంటలకు పూర్తయ్యింది. గ్రామ దేవతలకు గ్రామస్థులు అందరూ కలిసి ఊరేగింపుగా వెళ్లి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు సదాశివశర్మ మాట్లాడుతూ... మృత్యుంజయ యాగం సాధారణంగా ఆరోగ్యం, దీర్ఘాయువు, అకాల మరణం నుంచి రక్షణ, రోగాల నుండి ఉపశమనం కోసం, శివుడిని ప్రసన్నం చేసుకోవడానికి ఈ హోమం చేస్తారని తెలిపారు. హోమం చేయడం వల్ల దీర్ఘాయువు, మంచి ఆరోగ్యం లభిస్తాయని నమ్ముతారని, ముఖ్యంగా దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు, మృత్యు భయంతో ఉన్నవారు, ఈ హోమం చేయించుకుంటారని, గ్రామస్థుల కోరిక మేరకు శనివారం నిర్వహించామన్నారు. మృత్యుంజయుడు అంటే మృత్యువును జయించేవాడు. శివుడిని మృత్యుంజయుడిగా హిందువులు భావిస్తారని, భావి అకాల మరణాల నుండి రక్షణ పొందడానికి ఈ హోమం నిర్వహిస్తారన్నారు. మృత్యుంజయ హోమాన్ని వేద పండితులు సుధాకర్ శర్మ, కేదారినాథ్, యాద్ త్రిపాఠి, నరేష్, పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం 9 గంటలకు ఆంజనేయ స్వామి అభిషేకంతో పూజలు ప్రారంభమై స్థాపిత దేవతల పూజ, చండీయాగం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పెద్దమ్మ తల్లికి ఘనంగా బోనాలు

లోకేశ్వరం, మే 31 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో నెలకొన్న పెద్దమ్మ తల్లికి శనివారం ఉదయం నుండే ముదిరాజ్‌లు సాంప్రదాయ దుస్తులతో బోనాలు ఎత్తుకొని డప్పు, బ్యాండ్ మేళం చప్పుళ్లతో పెద్దమ్మ తల్లికి అంగరంగ వైభవంగా భక్తి శ్రద్ధలతో, వేద మంత్రాలతో అమ్మవారిని దర్శించుకుని బోనాలు సమర్పించారు. కోరిన కోరికలు తీర్చే పెద్దమ్మ తల్లిని దర్శించుకోవడానికి భక్తులు తండోపతండాలుగా వచ్చి వారి మొక్కులను తీర్చుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేశారు.

ముస్లిం ఏక్తా సంఘం ఆధ్వర్యంలో

కంటిచూపుపై అవగాహన సదస్సు

నిర్మల్ రూరల్, మే 31 (ఆంధ్రజ్యోతి) : ముస్లిం ఏక్తా సంఘం, ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్స్టిట్యూట్ ముథోల్ ధ్వర్యంలో పేద ప్రజలకు శనివారం పట్టణంలోని కంటిచూపుపై అవగాహన సదస్సు నిర్వహించినట్లు అధ్యక్షుడు షేక్ ముజాహిద్ తెలిపారు. ఈ సందర్భంగా ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్స్టిట్యూట్ ప్రోగ్రామ్ మేనేజర్ సాయన్న మాట్లాడుతూ... మా బృందం ప్రతి ఇంటికి వెళ్లి వాళ్ల పేరు నమోదు చేసుకొని, వాళ్లకు కంటి పరీక్షలు చేసి మా ట్రస్ట్ ఆధ్వర్యంలో సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. అవసరమైన వారికి కళ్ల అద్దాలు, ఇన్ఫెక్షన్ అయిన వాళ్లకు మందులు. ఆపరేషన్ అవసరమైన వారికి ఆపరేషన్ చేసి సేవలు అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముస్లిం ఏక్తా సంఘం అధ్యక్షుడు షేక్ ముజాహిద్ ప్రోగాం మేనేజర్ సాయన్న, కాంగ్రెస్ పార్టీ నాయకులు సాయి, నవీద్, కలాం గుణం జిల్లా సెక్రటరీ షాదుల్లా, హర్షద్, ముస్లిం ఏక్తా సంఘం ప్రధాన కార్యదర్శి అల్మాస్, ఫాజిల్ హాస్మి, వివిధ పార్టీ నాయకులు, సామాజిక సేవకులు పాల్గొన్నారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి

భైంసా రూరల్, మే 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాటేగాం టోల్ ప్లాజా వద్ద గుడిహత్నూర్‌కు చెందిన లారీడ్రైవర్ పాడ్ నందేవ్(39)ను గుర్తు తెలియని వాహనం ఢీకొని సంఘటన స్థలంలో మరణించాడు. వివరాలు ఇలా ఉన్నాయి. నిర్మల్ నుంచి భైంసాకు వస్తున్న కంటేనర్ లారీ మాటేగాం టోల్‌ప్లాజా వద్ద రోడ్డు పక్కన ఆపారు. డ్రైవర్ పాడ్ నందేవ్(39) రాత్రి కాలకృత్యాలకు రోడ్డు దాటుతుండగా నిర్మల్ నుంచి భైంసాకు వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. తలకు తీవ్రగాయం కావడంతో ఘటన స్థలంలో మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్సై సుప్రియ తెలిపారు. మృతుడికి ముగ్గురు పిల్లలు ఉన్నారు.

ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ల పట్టివేత

లోకేశ్వరం, మే 31 (ఆంధ్రజ్యోతి) : ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరిస్తున్న 15 ట్రాక్టర్లను లోకేశ్వరం తహసీల్దార్ సర్పరాజ్, ఎస్సై అశోక్‌కుమార్ వారి సిబ్బందితో చాకచక్యంగా పట్టుకున్నారు. లోకేశ్వరం మండల పరిధిలో సుద్దవాగు నుంచి శనివారం ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న లోకేశ్వరం తహసీల్దార్‌కు అలాగే పోలీసులకు సమాచారం అందిన వెంటనే సుద్దవాగుకు వెళ్లి 15 ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొని జరిమానా విధించి వాటిని పంపించారు. తహసీల్దార్, ఎస్సై మాట్లాడుతూ.... ఇకముందు ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నకిలీ విత్తనాలు అమ్మితే పీడీ యాక్ట్ కేసు

ఎస్పీ డా.జి. జానకి షర్మిల



ఫర్టిలైజర్ షాప్‌లో తనిఖీ చేస్తున్న అధికారులు



దిలావర్‌పూర్‌లోని ఫర్టిలైజర్ షాపులో తనిఖీ చేస్తున్న తహసీల్దార్, ఎంఏవో

నిర్మల్ రూరల్, మే 31 (ఆంధ్రజ్యోతి) : నకిలీ విత్తనాలు అమ్మితే పీడీ యాక్ట్ కేసు నమోదు చేస్తామని ఎస్పీ డా.జి. జానకీషర్మిల అన్నారు. శనివారం ఎస్పీ ఆదేశాలతో జిల్లాలోని అన్ని సీడ్స్ అండ్ ఫర్టిలైజర్ షాపులలో పోలీసు అధికారులు, ఎమ్మార్వో, వ్యవసాయ అధికారులతో కలిసి తనిఖీలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా స్టాక్ రిజిస్టర్, డెలివరీ రిజిస్టర్, బిల్ బుక్, తదితర రికార్డ్స్ తనిఖీ చేసి షాప్‌లో ఉన్న సీడ్స్ ఫర్టిలైజర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... నకిలీ విత్తనాలు, కాలం చెల్లిన విత్తనాలు, కాలం చెల్లిన పురుగు మందులు, నకిలీ పురుగు మందులు అమ్మే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తరచుగా షాప్‌లను తనిఖీ చేయడం జరుగుతుందని, రైతులను మోసం చేయాలని చూస్తే షాప్ యజమానులపై కఠినంగా వ్యవహరిస్తామని, రైతులు కూడా అప్రమత్తంగా ఉండి వ్యవసాయ అధికారులు సూచించిన విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. ఏ షాప్‌లో కొన్న తప్పకుండా బిల్ తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో విడి విత్తనాలు, ఎక్కడైనా నకిలీ విత్తనాలు ఉన్నట్లు నకిలీ పురుగు మందులు, కాలం చెల్లిన పురుగు మందులు, విత్తనాలు ఎవరైనా అమ్ముతున్నట్లు సమాచారం వస్తే వెంటనే డయల్ 100 లేదా సంబంధిత పోలీస్ స్టేషన్ కు సమచారం అందించాలని సూచించారు. ఫోన్ నెంబర్ 8712659599కు సమాచారం అందించాలని సూచించారు. నకిలీ విత్తనాలు కొని మోసపోవద్దని, కష్టానికి తగిన ప్రతిఫలం పొందాలంటే లైసెన్స్ ఉన్న దుకాణాల్లో మాత్రమే విత్తనాలు కొనాలని సూచించారు.

నకిలీ విత్తనాలు, ఎరువులు అమ్మితే లైసెన్స్‌లు రద్దు చేస్తాం

దిలావర్‌పూర్, మే 31 (ఆంధ్రజ్యోతి) : నకిలీ విత్తనాలు, కాలం చెల్లిన ఎరువులు అమ్మితే సంబంధిత షాపుల లైసెన్స్‌లను రద్దు చేసి క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్‌ఖాన్ హెచ్చరించారు. శనివారం దిలావర్‌పూర్ మండల కేంద్రంలోని పలు ఫర్టిలైజర్ షాపులను మండల వ్యవసాయ అధికారి రాజశేఖర్ రెడ్డి, ఏఎస్సై భీమ్‌రావులతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతుల అమాయకత్వం, అసహాయతను అడ్డుపెట్టుకొని రైతులను మోసం చేయాలని చూస్తే కఠినచర్యలు ఉంటాయన్నారు. నాణ్యమైన విత్తనాలు, ఎరువులను విక్రయించాలని సూచించారు. ఎవరైనా రైతులకు నకిలీలను అంగడితే చర్యలు తీవ్రంగా ఉంటాయని మరోసారి హెచ్చరించారు.

ఎరువుల దుకాణంలో అధికారుల ఆకస్మిక తనిఖీలు

నర్సాపూర్(జి), మే 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రైతాంగానికి నాణ్యమైన ఎరువులు అందేలా చూడాలనే లక్ష్యంతో మండల తహసీల్దార్ శ్రీకాంత్, మండల వ్యవసాయ అధికారి రామచంద్ర నాయక్ ఎరువుల దుకాణాలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. శనివారం ఉదయం ప్రాంతంలో మండల కేంద్రంలోని రమేష్ ఏజెన్సీస్ దుకాణం యజమాని గడ్డం రమేష్ రెడ్డి, అర్లి(కే) ఎక్స్ రోడ్ వద్ద అంజి వైష్ణవి సీడ్స్ పెస్టిసైడ్స్, ఫర్టిలైజర్ దుకాణంలో యజమాని సూర్యవంశీ లక్ష్మణ్‌కు చెందిన ఎరువుల దుకాణం, చాక్‌పల్లి ఎరువుల దుకాణంలో బృందం తనిఖీలను నిర్వహించింది. రైతులు అధిక ధరలు చెల్లించి కొనుగోలు చేసే ఎరువులు నాణ్యమైనవి కాకపోతే వారికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని మండల తహసీల్దార్ శ్రీకాంత్ అన్నారు. దీనిని నివారించడానికి మేము ఎప్పటికప్పుడు దుకాణాలను తనిఖీ చేస్తున్నామన్నారు. నాణ్యత లోపాలు ఉన్నట్లు తేలితే సంబంధిత దుకాణదారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. ఈ తనిఖీలు మండలంలోని ఇతర ఎరువుల దుకాణాలలో కూడా కొనసాగే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ వర్గాలు తెలిపాయి. ఈ కార్యక్రమంలో మండల అధికారులు పాల్గొన్నారు.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా స్థాయి సమీక్ష

సమావేశంలో పాల్గొన్న కలెక్టర్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

నిర్మల్ రూరల్, మే 31 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా స్థాయి సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పాల్గొన్నారు. శనివారం మంచిర్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంత్రి డి.అనసూయ సీతక్క నిర్వహించిన ఉమ్మడి జిల్లా సమీక్ష సమావేశంలో ధాన్యం కొనుగోలు, ఇందిరమ్మ ఇళ్లు, భూ భారతి, వానకాలం పంట సన్నద్ధత జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు.

పందులను

కట్టడి చేయకపోతే కఠిన చర్యలు


డీఎల్‌పీవో అజీజ్‌ఖాన్



సమావేశంలో ఇన్‌చార్జి డీఎల్ పీవో, ఇతర అధికారులు

దిలావర్‌పూర్, మే 31 (ఆంధ్రజ్యోతి) గ్రామస్థులకు అసౌకర్యం కలిగిస్తున్న పందులను కట్టడి చేసుకోలేకపోతే కఠిన చర్యలుంటాయని ఇన్‌చార్జి డీఎల్‌పీవో అజీజ్‌ఖాన్ పందుల పెంపకం దారులను తీవ్రంగా హెచ్చరించారు. గ్రామస్థులు, పందుల పెంపకం దారులతో శనివారం సమావేశం ఏర్పాటు చేశారు. గత పదేళ్లుగా పందులతో ఇబ్బంది పడుతున్న గ్రామస్థులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనేక సార్లు పందుల పెంపకం దారులు, గ్రామస్థులతో సమావేశాలు ఏర్పాటు చేస్తున్నప్పటికీ పందుల పెంపకం దారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఏంటని ప్రశ్నించారు. ఇదే మే నెలలోనే మూడుసార్లు సమావేశం ఏర్పాటు చేసినా అయినా పెంపకం దారుల్లో మార్పు లేదని, ఇది ఇలాగే కొనసాగితే సమస్య మరింత తీవ్రమవుతుందన్నారు. గ్రామంలో పందులను విచ్చలవిడిగా వదిలి వేయడం వల్ల ఇళ్లలోకి చొరబడుతున్నా పట్టించుకోరా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్షాకాలం దృష్ట్యా పందుల వల్ల వ్యాధులు వచ్చే ప్రమాదం పొంది ఉన్నందున ఇప్పటికైనా పందులను కట్టడి చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో అరుణరాణి, ఎంపీవో గోవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ పంపిణీని గడువు తేదీలోగా పూర్తి చేయండి



లక్ష్మణచాంద, మే 31 (ఆంధ్రజ్యోతి) : రేషన్‌పంపిణీని గడువు తేదీ అయిన ప్రతి నెల 15వ తేదీలోగా పూర్తి చేయాలని తహసీల్దార్ సరిత ఆదేశించారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శనివారం రేషన్‌డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...ప్రభుత్వం 3 నెలల రేషన్‌ను ఒకేసారి రేషన్‌షాపులకు చేరవేస్తున్న సంగతిని గుర్తు చేశారు. నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన సరితను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో రేషన్‌డీలర్ల మండల అధ్యక్షుడు కూన పోశెట్టి, ఉపాధ్యక్షుడు జుంజురు రాజేశ్వర్, రేషన్ డీలర్లు మేరి, లింగన్న, ఓస మల్లేష్, కోరుకొప్పుల రాజాగౌడ్, గడ్డం శ్రీనివాస్ రెడ్డి, జి. శ్రీనివాస్ రెడ్డి, మోహన్, బోరిగాం గంగాధర్, నర్సయ్య, సాయి, రవి, తదితరులు ఉన్నారు.

మోటార్‌సైకిల్ దొంగల ముఠా అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న పోలీసు అధికారులు

నిర్మల్ కల్చరల్, మే 31 (ఆంధ్రజ్యోతి) : గత కొద్దిరోజులుగా నిజామాబాద్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో మోటార్ సైకిల్ దొంగతనాలకు పాల్పడుతున్న ముఠాను శుక్రవారం జిల్లా పోలీసులు పట్టుకున్నారు. ఎస్పీ జానకి షర్మిల ఆదేశాలతో ఏర్పాటు చేసిన ప్రత్యేక పోలీసు బృందం ఎస్సై లింబాద్రి చాకచక్యంగా దొంగలను వెంబడించి పట్టుకున్నారు. ఈడెన్ గార్డెన్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా వైఎస్‌ఆర్ కాలనీ నుంచి వస్తున్న పోలీసులను చూసి ముఠా పారిపోయే ప్రయత్నం చేశారని సీఐ కృషి శనివారం విలేకరులకు తెలిపారు. వారిని పట్టుకొని విచారించగా వివరాలు వెల్లడించారన్నారు. వైఎస్‌ఆర్ కాలనీకి చెందిన మెషిన్ ఖాన్, పురాణబజార్‌కు చెందిన అవిజ్ చావుస్, బుధవార్‌పేట్‌కు చెందిన సోఫియుద్దీన్ అని వెల్లడించినట్లు చెప్పారు. నిజామాబాద్‌తో పాటు జిల్లాలో మోటార్ సైకిళ్ల దొంగిలించినట్లు నేరం ఒప్పుకున్నట్లు తెలిపారు. వారి నుండి నాలుగు మోటార్ సైకిళ్లు, ఓ మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకొని నిందితులను రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. నిందితులను చాకచక్యంగా పట్టుకున్న ఇన్స్‌పెక్టర్ మున్నూరు కృష్ణ, ఎస్సై లింబాద్రి, కానిస్టేబుళ్లను ఎస్పీ అభినందించారు.

దోపిడీకి పాల్పడుతున్న రైల్‌మిల్లర్లపై చర్యలు తీసుకోవాలి : ఏలేటి



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

సారంగాపూర్, మే, 31 : (ఆంధ్రజ్యోతి) : రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యంను తేమ శాతం పేరుతో దోపిడి చేస్తున్న రైస్‌మిల్లర్ల యజమానులపై అధికారులు చర్యలు తీసుకోవాలని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని తాండ్ర, వైకుంఠపూర్, కంకెట గ్రామాల్లోని కొనుగోలు చేస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులతో మాట్లాడారు. కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేసి, రైతు సమస్యలను తెలుసుకొని, వాటిని పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. రైస్‌మిల్లుల్లో తేమశాతం పేరుతో అధిక దోపిడికి పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని వారిపై వెంటనే చర్యలు తీసుకొని రైస్ మిల్లులను సీజ్ చేయాలని అధికారులకు ఆదేశాలను జారీ చేశారు. తడిసిన ధాన్యాన్ని వెంటనే తూకం చేసి రైతులను ఆదుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు కార్యకర్తలు రైతులు ఉన్నారు.

కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే

సోన్, మే 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కడ్తాల్ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి పరిశీలించారు. వర్షాలతో తడిసిన ధాన్యాన్ని సైతం ప్రభుత్వం కొనుగోలు చేయాలన్నారు. కల్లాల్లో ఉన్న ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు మార గంగారెడ్డి, హరీష్ రెడ్డి, రాజ నర్సయ్య, సుంచు నవీన్, మద్దెల గంగాధర్, గుర్రం నారాయణ, దినేష్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.



కుచలాపూర్‌లో నిందితున్ని అదుపులోకి తీసుకున్న అధికారులు

నకిలీ పత్తి విత్తనాల పట్టివేత

తలమడుగు, మే 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుచలాపూర్ గ్రామంలో నకిలీ పత్తి విత్తనాలు పట్టుకొని కేసు నమోదు చేయడం జరిగిందని టాస్క్‌ఫోర్స్ అధికారులు ఎస్‌ఐ రాధిక, వ్యవసాయ అధికారి ప్రమోద్ రెడ్డిలు తెలిపారు. వివరాల ప్రకారం.. కుచలాపూర్ గ్రామంలో నకిలీ విత్తనాలు ఉన్నట్లు సమాచారం రావడంతో టాస్క్‌ఫోర్స్ అధికారులు, ఎస్సై, వ్యవసాయ అధికారితో పాటు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రోహిదాస్, మండల టాస్క్‌ఫోర్స్ టీమ్ ఆధ్వర్యంలో కుచలాపూర్ గ్రామం మండల వ్యవసాయ విస్తరణ అధికారి ఆధ్వర్యంలో జక్కుల వెంకన్న దగ్గర 25 నకిలీ విత్తన ప్యాకెట్లను సీజ్ చేశామని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో ఎవరైనా నకిలీ విత్తనాలు అమ్మిన కొన్న వారిపైన చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. కాగా, రాష్ట్ర ప్రభుత్వం నకిలీ విత్తనాలను అరికట్టేందుకు నెలరోజుల నుంచి పకడ్బందీగా చర్యలు చేపడుతున్నప్పటికీ మండలంలోని కుచలాపూర్ గ్రామానికి నకిలీ విత్తనాలు ఎక్కడ నుంచి సరఫరా అయ్యాయి, దాని వెనకాల ఎవరు ఉన్నారు, ఇతర గ్రామాలకు కూడా సరఫరా చేశారా? అనే కోణం మీద అధికారులు విచారణ చేపడుతున్నారు.

'పని భారం మోపితే ఎలా?'

బోథ్, మే 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు రావాల్సిన నిధులు మంజూరు చేయకుండా పంచాయతీ కార్యదర్శులపై ఆర్థిక భారం మోపుతుందని ఈ విధంగా అయితే పనులను చేయలేమంటూ ఎంపీడీవో రమేష్‌కు మండలంలోని వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో శనివారం వినతి పత్రం ఇవ్వడం జరిగింది. గత 18 ఏళ్ల కాలంగా గ్రామ పంచాయతీలకు రావాల్సిన బకాయిలు చెల్లించకపోవడంతో తాము తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని వినతి పత్రంలో విన్నవించారు. అంతేగాక చెత్త సేకరణ విద్యుత్ మోటార్ మరమ్మతు వీధి దీపాల ఏర్పాటు ఇటువంటి కార్యక్రమాలను తాము చేయించలేమని వివరించారు. గ్రామ పంచాయతీలకు రావాల్సిన బకాయిలను ప్రభుత్వం విడుదల చేయాలని వారు కోరారు. లేదంటే ఆర్థిక భారం తమపై పడుతుందని వాపోయారు.

గ్రామ కార్యదర్శుల కార్యవర్గం ఏర్పాటు

బోథ్, మే 31(ఆంధ్రజ్యోతి): మండల కార్యదర్శుల కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జాదవ్ అశోక్ కుమార్, ఉపాధ్యక్షుడిగా మిథున్‌చక్రవర్తి, లక్ష్మీనారాయణలను ఎన్నుకోగా.. జనరల్ సెక్రెటరీగా శిరీష, ఎండీ షేక్‌చాంద్, కోశాధికారిగా జితేందర్, సలహాదారులుగా అంజయ్య, సోషల్ మీడియా సభ్యుడిగా గంగయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జేపీసీ కార్యదర్శుల సంఘం అధ్యక్షులు మాట్లాడుతూ గ్రామ కార్యదర్శి ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. భవిష్యత్తులో గ్రామ కార్యదర్శుల సమస్యలన్నింటినీ రాష్ట్రస్థాయి అధికారుల దృష్టికి తీసుకు వెళ్తామని పేర్కొన్నారు.

సాంగిడిలో ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ

బేల, మే 31(ఆంధ్రజ్యోతి): ఇల్లు లేని పేద ప్రజలకు ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇచ్చి వారి కలను సహకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని అధికారులు ఆదిలాబాద్ యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ఉపాధ్యక్షుడు సామ రూపేష్ రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు ఇల్లు లేని పేద ప్రజలను గుర్తించి బేల మండలంలోని సాంగిడి గ్రామంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు కలిసి 35 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శనివారం భూమి పూజ చేశారు. అనంతరం సామ రుపేష్ రెడ్డి మాట్లాడారు.

వ్యవసాయ బావిలో పడ్డ ఎలుగుబంటి

● మూడు గంటల పాటు శ్రమించి బయటకు తీసిన అధికారులు

బోథ్/సోనాల, మే 31(ఆంధ్రజ్యోతి): అడవిలో ఉండాల్సిన ఎలుగుబంటి దాహం తీర్చుకునేందుకు సమీపంలోని వ్యవసాయ బావిలో పడిన సంఘటన ఆదిలాబాద్ జిల్లాలో చోటు చేసుకుంది. వివరాలు.. జిల్లాలోని బోథ్ మండల శివారు గ్రామమైన సాకేర గ్రామం సమీపంలోని పొలంలో ఉన్న బావిలో శనివారం ఉదయం 10 గంటలకు దాహం తీర్చుకునేందుకు వచ్చి ప్రమాదవశాత్తు బావిలో పడిపోయింది. గమనించిన గ్రామస్థులు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. అధికారులు వచ్చేలోపు గ్రామస్థులు మంచానికి తాళ్లతో కట్టి బావిలోకి దించారు. మంచంలోకి ఎక్కిన ఎలుగుబంటి మధ్యలోకి రాగానే అక్కడికి చేరుకున్న గ్రామస్థుల అరుపులు, కేకలకు భయపడి తిరిగి బావిలోకి దూకింది. అయితే అటవీ శాఖ అధికారులు పోలీసులకు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో వారు అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. స్థానిక ఎస్సై ప్రవీణ్ గ్రామస్థులని బావికి దూరంగా పంపించడంతో పాటు అగ్నిమాపక సిబ్బంది తీసుకువచ్చిన నిచ్చెనను బావిలోకి వేసి ఎలుగుబంటిని పైకి తీసే ప్రయత్నం చేశారు. ఎలుగుబంటి నిచ్చెన ఎక్కి జేసీబీ బకెట్‌లోకి వచ్చి కూర్చుంది.



మంచం బావిలోకి దించి ఎలుగుబంటిని పైకి తీస్తున్న అధికారులు

దీంతో ఎలుగుబంటిని బయటకు తీయడంతో అడవిలోకి పరిగెత్తింది. మూడు గంటల పాటు అటవీశాఖ, పోలీసులు, అగ్నిమాపక శాఖ, గ్రామస్థుల సహకారంతో ఎలుగుబంటిని సురక్షితంగా బయటకు తీశారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలి

బోథ్, మే 31(ఆంధ్రజ్యోతి): మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం నూతనంగా ఎస్‌వీఈపీ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందని డీఆర్డీఏ పీడీ గోవిందరావు పేర్కొన్నారు. శనివారం వెలుగు కార్యాలయంలో నూతనంగా ఎంపికైన సిబ్బందికి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు గాను నూతనంగా ఎంపికైన సిబ్బంది కృషి చేయాలన్నారు. ఇందులో ఏపీడీ శేషరావు, ఏపీఎం మాధవ్, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సమ్మర్ క్యాంప్

ఆదిలాబాద్ అర్బన్, మే 31(ఆంధ్రజ్యోతి): పట్టణంలో వేంకటేశ్వర సంగీత నాట్య అకాడమి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంపు శనివారంతో ముగిసింది. ఈ ముగింపు కార్యక్రమాన్ని జడ్పీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేయగా దీనికి మాజీ మంత్రి జోగురామన్న ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీఈవో శ్రీనివాసరావు, కొండయ్య చౌదరి, విజయ్‌బాబు, వైద్యులు అబిజిత్, కళాకారులు కవిత, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాణి అహిల్య బాయి జయంతి

ఉట్నూర్, మే31 (ఆంధ్రజ్యోతి): రాణి అహిల్యాబాయి హోల్కర్ 300వ జయంతిని ఉట్నూర్‌లో బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉట్నూర్ మండల కేంద్రంలోని పూలాజీబాబా డిగ్రీ కళశాల ఆవరణలో మహానాయకురాలి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ మండల అధ్యక్షుడిగా బింగి వెంకటేశ్ మాట్లాడుతూ స్త్రీ అంటే అబల కాదు ఆదిశక్తి అని నిరూపించిన ధీరోదాత్రి అని అన్నారు. ప్రజాక్షేమమే ప్రగతి మార్గమని నమ్మి ప్రజానురంజకంగా రాజ్యపాలన చేసిన సాహస పుత్రి అని, సనాతన ధర్మ రక్షణకై జీవితాన్ని దారపోసిన ధీరవనిత అన్నారు. విధర్మీయుల వికృతి చేష్టలకు విలుప్తమైన ఎన్నో ఆలయాలను పునర్నిర్మించిన పుణ్య చరిత, భారతీయ సనాతన ధర్మతేజం రాజమాత రాణి అహల్యాబాయి హోల్కర్ అని అన్నారు. ఇందులో శ్రీరామ్‌నాయక్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ జాదవ్ సుమన్‌బాయి, జిల్లా కార్యదర్శి కొండేరి రమేష్, మాజీ ఎంపీపీ ఆడేధన్‌లాల్ నాయక్, మాజీ ఎంపీటీసీ పీపతి లింగాగౌడ్, రాథోడ్ శేషారావు, బానోత్ జగన్, కాల్వ రవి, తదితరులు పాల్గొన్నారు.

గుడిహత్నూర్: రాజామాత భారత మహారాణి అహల్య బాయి హోల్కర్ జయంతిని శనివారం మండలంలోని లింగాపూర్‌లో గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు శ్రీరంగ్, ఉప్పారాపు సత్యరాజ్, సుధాకర్, కేశవ్, సుభాష్, రాహుల్, ఓం కుమార్, వినోద్, రవి, శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: రాణి ఆహిల్యాబాయి హోల్కర్ జీవితం స్పూర్తిదాయకమని బీఆర్ఎస్ నాయకులు సేండ్గే సతీష్ అన్నారు. శనివారం మండలంలోని ధన్నోర్(బి) గ్రామంలో రాణి ఆహిల్యాబాయి హోల్కర్ జయంతిని పురస్కరించుకుని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆహిల్యాబాయి హోల్కర్ కాశీ నుంచి కన్యాకుమారి వరకు దేవాలయాల పునర్నిర్మాణానికి చేసిన కృషి అమోఘమైనదన్నారు. బాల్య వివాహాలను వ్యతిరేకించడం, ప్రజల శ్రేయస్సు, సంక్షేమ పాలన ఆమె హయాంలో జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పటేల్ అమోల్, మాజీ ఎంపిటిసి సభ్యులు కోవా రాజేశ్వర్, బీఆర్ఎస్ గ్రామ యూత్ ప్రసిడెంట్ సింధే కృష్ణ, రవి, జైదీప్, తదితరులు పాల్గొన్నారు.

విద్యా వ్యాపారాన్ని అరికట్టాలి : యూటీఎఫ్

ఇంద్రవెల్లి, మే 31(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో ప్రైవేట్ కార్పోరేట్ విద్యా వ్యాపారాన్ని అరికట్టి, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.కిష్టన్న, వి.అశోక్‌లు డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచుటకై టిఎస్ యూటీఎఫ్ చేపట్టిన ఎన్రోల్మెంట్ ప్రచార జాతాలో భాగంగా శనివారం మండల కేంద్రంలో వారు ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో టిఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు ఇ. శివన్న, యం.శ్యాంసుందర్, కె.శ్రీనివాస్, సోషల్ మీడియా కన్వీనర్ కె శంకర్, జిల్లా కమిటీ సభ్యులు ఎన్. గణేష్, ఎం.మహేందర్, ఓ.అశోక్, ఎ. శివన్న, ఎ. జంగు, చవాన్, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చోడ: కార్పొరేట్, ప్రైవేటు సంస్థలో విద్యా వ్యాపారాన్ని అరికట్టి, ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, విద్యతో వ్యాపారం చేసేవారిపై చర్యలు చేపట్టాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కిష్టన్న డిమాండ్ చేశారు. శనివారం ఇచ్చోడ మండలకేంద్రంలో ఏర్పాటుచేసిన ఎన్‌రోల్‌మెంట్ ప్రచార జాబితలో భాగంగా వారు మాట్లాడారు. ఇచ్చోడలో పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ప్రైవేటు పాఠశాలలకు అడ్డుకట్ట వేసి ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక సదుపాయాలను కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో టిఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు ఆశోక్, శివన్న, శ్యాంసుందర్, తదితరులు పాల్గొన్నారు.

ఉట్నూర్: తెలంగాణ రాష్ట్రంలో ప్రైవేట్, కార్పొరేట్ విద్యా వ్యాపారాన్ని అరికట్టి, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె.కిష్టన్న, వి.అశోక్‌లు డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచుటకై టీఎస్ యూటీఎఫ్ చేపట్టిన ఎన్‌రోల్‌మెంట్ ప్రచార జాతలో భాగంగా శనివారం ఉట్నూర్ మండల కేంద్రంలో వారు ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ప్రైవేట్ పాఠశాలలకు అడ్డుకట్ట వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు ఇ.శివన్న, ఎం.శ్యాంసుందర్, కె.శ్రీనివాస్, సోషల్ మీడియా కన్వీనర్ కె.శంకర్, జిల్లా కమిటీ సభ్యులు ఎన్.గణేష్, ఎం.మహేందర్, ఓ అశోక్, ఎ.శివన్న, ఎ. జంగు, చవాన్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

'యువ వికాసం'పై ఆశలు ఆవిరి!

(5వ పేజీ తరువాయి...)

తీరుపై ఆయా గ్రామాల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతుంది. అలాగే చిన్నపాటి కారణాలతో లబ్ధిదారుల జాబితా నుంచి పేర్లను తొలగించడంపై స్థానిక ప్రజాప్రతినిధులు అధికారులతో వాగ్వాదానికి దిగుతున్నారు. మొదటి విడత టార్గెట్‌కు మించకుండా అధికారులు లబ్ధిదారుల జాబితాలతో కసరత్తు చేస్తున్నారు. ఆదివారం సాయంత్రం లోపు ఫైనల్ జాబితాను సిద్ధం చేసి ఎంపికైన లబ్ధిదారులకు ముందస్తు సమాచారం ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడి మృతి

ఇంద్రవెల్లి, మే 31(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి చెందిన ఘటన శనివారం మండలంలోని అనంతపూర్ గ్రామ సమీపంలో జరిగింది. దీనికి సంబంధించి 108 పైలెట్ ఆత్రం అశోక్, ఎస్సై ఇ.సాయన్న తెలిపిన వివరాల ప్రకారం.. ఇచ్చోడ మండలంలోని గుండాల గ్రామానికి చెందిన హర్షద్, సల్మా దంపతులకు చెందిన సుహాన్(13) సిరికొండ మండలంలోని తమ బంధువుల వద్ద ఉంటూ ఉర్దూ మీడియం స్కూల్‌లో 6వ తరగతి చదువుతున్నాడు. అయితే మామ షేక్ అలాం ప్రతిరోజు ట్రాలీ ఆటో ద్వారా గ్రామీణ ప్రాంతంలోని కిరాణ షాపులకు సరుకులు సరఫరా చేస్తున్నాడు. శనివారం కూడా కిరాణా సరుకులు తీసుకెళుతున్న మేన మామ షేక్ అలాంకు తోడుకు సుహాన్ వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో ఇంద్రవెల్లి మండలంలోని అనంతపూర్ గ్రామ సమీపంలో ప్రమాదవశాత్తు ఆటో బోల్తా పడటంతో సుహాన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే 108 అంబులెన్స్ సహాయంతో ఆదిలాబాద్‌లోని రిమ్స్ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించి చికిత్సలు పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఆదిలాబాద్ రిమ్స్‌కు సందర్శించి మృతదేహాన్ని పరిశీలించారు. పంచనామా నిర్వహించి పోస్టు మార్టంకు తరలించారు. కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బరంపూర్‌లో యువకుడి ఆత్మహత్య

తలమడుగు, మే 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని బరంపూర్ గ్రామానికి చెందిన యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై రాధిక తెలిపారు. దీనికి సంబంధించి పూర్తి వివరాల ప్రకారం.. మండలంలోని బరంపురం గ్రామానికి చెందిన సందనవేణి లక్ష్మన్న (22) అనే యువకుడు గత కొంతకాలంగా కడుపు నొప్పితో బాధపడుతూ శనివారం కడుపునొప్పి ఎక్కువ కావడంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానికులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తలమడుగు పోలీసులు పేర్కొన్నారు.

ఉరివేసుకుని యువకుడి బలవన్మరణం

ఇచ్చోడ, బజార్‌హత్నూర్ 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని వర్తమన్నూర్ గ్రామానికి చెందిన సిడాం అర్జున్(30) తన వ్యవసాయ క్షేత్రంలోని వేప చెట్టుకు ఉరివేసుకుని మృతిచెందినట్లు ఏఎస్సై లింబాజి తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న అర్జున్ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడని పేర్కొన్నారు. దీంతో జీవితంపై విరక్తి చెంది శనివారం ఉదయం ఉరి వేసుకొని మృతి చెందినట్లు ఆయన పేర్కొన్నారు. కాగా, మృతుడి భార్య సిడం విజయలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తునట్లు తెలిపారు. మృతుడికి ఇద్దరు కూతుర్లు ఉన్నారు.

బాధిత కుటుంబాకి పరామర్శ

తలమడుగు, మే 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తూరు గ్రామ మాజీ సర్పంచ్ జయశ్రీ భర్త ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబాన్ని డీసీసీబీ చైర్మన్ అడ్డి బోజారెడ్డి, బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆడే గజేందర్, వీరితోపాటు మాజీ జెడ్పిటిసి గోక గణేష్ రెడ్డి, మాజీ ఎంపీటీ కళ్యాణ లక్ష్మి రాజేశ్వర్‌లు పరామర్శించారు వారి కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఇందులో బోథ్ నియోజవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బద్దం పోతు రెడ్డి, మాజీ ఎంపీటీసీ వెంకన్న యాదవ్, మైనార్టీ నాయకులు సద్దాం, రామ్ రెడ్డి, రావుల నారాయణ, తదితరులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ రాజేందర్

ధూమపానంతో
కలిగే అనర్థాలపై అవగాహన కల్పించాలి

నిర్మల్ కల్చరల్, మే 31 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు ధూమపానంతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ రాజేందర్ అన్నారు. శనివారం జిల్లా కార్యాలయంలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయిస్తూ మాట్లాడారు. ధూమపానంతో ఆరోగ్యాలు నష్టపోతారని ఈ వ్యసనం మానుకునేలా ప్రజలను చైతన్యపరచాలని సూచించారు. గుట్కా, సిగరెట్, బీడీ వంటి వాటిలో విషపదార్థాలు ఉంటాయన్న సంగతి తెలియజేయాలన్నారు. తద్వారా ఊపిరితిత్తుల క్యాన్సర్, హార్ట్ ఎటాక్, గొంతు క్యాన్సర్, బ్లడ్ క్యాన్సర్ తదితర ప్రాణాంతక వ్యాధులు ప్రబలి జీవితాలు కోల్పోతారని తెలియజేశారు. డాక్టర్ నయనారెడ్డి, ఆశిష్‌రెడ్డి, సౌమ్య, మీడియా అధికారి రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

పీఆర్ ఈఈగా జాదవ్ చందు బాధ్యతల స్వీకరణ

నిర్మల్ కల్చరల్, మే 31 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ జిల్లా పంచాయతీ రాజ్ ఇంజినీర్‌గా జాదవ్ చందు శనివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో పని చేసిన శంకరయ్య పెద్దపెల్లికి బదిలీ కాగా ఆయన స్థానంలో నూతనబాధ్యతలు చేపట్టారు. కార్యాలయ సిబ్బంది వారిరువురిని సన్మానించారు.

పదవీ విరమణ చేస్తున్న మెదక్ ఎస్పీకి ఉద్యోగుల సన్మానం

నిర్మల్ కల్చరల్, మే 31 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ జిల్లాలోని పలుచోట్ల పని చేసి మెదక్ ఎస్పీగా పదవీ విరమణ చేస్తున్న డి.ఉదయ్ కుమార్‌ను శనివారం జిల్లా రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అక్కడ ఘనంగా సన్మానించింది. మెదక్‌లో నిర్వహించిన ఆత్మీయ వీడ్కోలు సమావేశానికి జిల్లా అధ్యక్షుడు ఎంసీ లింగన్న, ఎంఏ కరీం, జాపరాములు, సాత్వారం, జాన్‌దివాకర్, తదితరులు హాజరై శాలువా, జ్ఞాపికతో సన్మానించారు.

పదవీ విరమణ చేసిన ఏఆర్ కానిస్టేబుల్‌కు సన్మానం

నిర్మల్ కల్చరల్, మే 31 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో సుదీర్ఘ కాలంగా పోలీసు శాఖలో విధులు నిర్వహించి శనివారం పదవీ విరమణ చేసిన ఏఆర్ కానిస్టేబుల్ అంబారావును ఎస్పీజానకిషర్మిల శాలువా, జ్ఞాపికతో సన్మానించారు. ఆయన శేష జీవితం సుఖసంతోషాలతో గడవాలని ఆకాంక్షించారు. పోలీసుశాఖ, పోలీసులు అందుబాటులో ఉండి వారికి రావలసిన ఆర్థిక ప్రయోజనాలు అందేలా చూస్తుందన్నారు. అదనపు ఎస్పీ ఉపేందర్ రెడ్డి, ఏవో యూనిస్ అలీ, ఆర్ఐలు రాంనిరంజన్‌రావు, శేఖర్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి దరఖాస్తుల క్షేత్ర పరిశీలన

దిలావర్‌పూర్, మే 31 (ఆంధ్రజ్యోతి) : కళ్యాణ లక్ష్మి పథకం కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి ఎంఆర్ఐ మమత దరఖాస్తుల్లో పొందుపరిచిన వివరాలను పరిశీలించారు. మరిన్ని వివరాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. కాగామూడు నెలల క్రితం చేసుకున్న దరఖాస్తులను పరిశీలిస్తున్నట్లు చెప్పారు.

వన మహోత్సవానికి మొక్కలు సిద్ధం చేయాలి : ఎంపీవో

వన మహోత్సవానికి మొక్కలు సిద్ధంగా ఉంచాలని ఎంపీవో గోవర్ధన్ సూచించారు. శనివారం దిలావర్‌పూర్‌లో నర్సరీని సందర్శించి మొక్కలను పరిశీలించారు. జూన్ నెలలో వన మహోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని అప్పటి వరకు మొక్కలు సిద్ధం చేయాలన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం

● భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్



మాట్లాడుతున్న ఏఎస్పీ అవినాష్‌కుమార్

భైంసా, మే 31 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల పరిరక్షణకే పోలీసుశాఖ నిరంతరం కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ నిర్వహిస్తుందని భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్ పేర్కొన్నారు. శనివారం రెవెన్యూ డివిజన్ కేంద్రమైన భైంసాలోని నయాబాది ఏరియాలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. అసాంఘిక కార్యకలపాల కట్టడి చేసేందుకు పోలీసుశాఖ నిరంతరం కృషి చేస్తుందన్నారు. కాలనీల్లో, ఇంటి పరిసరాల్లో అనుమానితంగా సంచరిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కొత్తగా ఇండ్లలో అద్దెకు వచ్చే వారి పూర్తి వివరాలు తెలుసుకున్నా తర్వాతే అద్దెలకు ఇవ్వాలని సూచించారు. భైంసా పట్టణాన్ని నేరరహిత పట్టణంగా తీర్చిదిద్దడంతో పాటు ప్రజలకు రక్షణ కల్పించేందుకు తాము పని చేస్తున్నామని వివరించారు. నేర నియంత్రణకు సీసీ కెమెరాలు ఏర్పాటు ఎంతో ముఖ్యమని, ఆ దిశగా ఏర్పాటు చేసుకొని పోలీసులకు సహకరించాలని కోరారు. ప్రజలు సైబర్‌క్రైమ్ పట్ల జాగ్రత్తగా ఉండాలని, తెలియని మెసేజ్‌లను, లింకులను ఓపెన్ చేయవద్దని, తమ పిల్లల యొక్క మొబైల్ ఫోన్ వినియోగాన్ని తరుచు పరిశీలిస్తు ఉండాలన్నారు. గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఎక్కడైన గంజాయి సేవించడం గానీ, విక్రయించినట్లు, రవాణా చేస్తున్నట్లు ఉంటే వెంటనే 100 కాల్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని వెల్లడించారు. అంతకు ముందు సరైన పత్రాలు లేని 64 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఇందులో పట్టణ సీఐ గోపీనాథ్, ఎస్సైలు గణేష్, గౌస్, సిబ్బంది పాల్గొన్నారు.



శాంతిభద్రతలపై అవగాహన కల్పిస్తున్న ఏఎస్పీ అవినాష్‌కుమార్

ధర్మరక్షణకు పోరాడిన మహోన్నత మూర్తి అహల్యాబాయి



అహల్యాబాయి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న బీజేపీ శ్రేణులు

భైంసా, మే 31 (ఆంధ్రజ్యోతి): హిందూ ధర్మపరిరక్షణ కోసం పోరాడిన మహోన్నత వ్యక్తి రాణి అహల్యాబాయి అని బీజేపీ భైంసా పట్టణ, మండల అధ్యక్షులు రావుల రాము, సిరం సుష్మారెడ్డిలు పేర్కొన్నారు. శనివారం భైంసా పట్టణంలోని ఎమ్మెల్యే రామరావ్ పాటిల్ నివాసంలో రాణి అహల్యాబాయి హోల్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. 70 వేల హిందూ ఆలయాలను పునర్నిర్మించిన ఘనత ఆమెదేనన్నారు. తన రాజ్యంలో మహిళలను సైన్యాధ్యక్షులుగా నియమించాలన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్న ఉద్దేశ్యంతో ఎన్నో కార్యక్రమాలను చేపట్టారన్నారు. అహల్యాబాయి లాంటి మాతృమూర్తులను ఆదర్శంగా తీసుకొని భారత ప్రధానమంత్రి నరేంద్రమోడీ నేడు మహిళలకు రక్షణ రంగంతో పాటు అన్ని రంగాల్లో అవకాశాలు కల్పిస్తున్నారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు భూమేష్, మండల నాయకులు బీమినేని శంకర్, మాజీ కౌన్సిలర్ గౌతం పింగ్లే, మండల ప్రధాన కార్యదర్శి ఆకాష్, ఉపాధ్యక్షులు మహేందర్, ప్రనిధులు సత్యనారాయణరెడ్డి, బండారి దిలీప్, గంగాప్రసాద్, కాసరోల్ల ప్రవీణ్, హన్మండ్లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా త్రిశత జయంతి వేడుకలు

ఖానాపూర్, మే 31 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో శనివారం బీజేపీ ఆధ్వర్యంలో రాజమాత దేవి అహల్య బాయి హోల్కర్ త్రిశత జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఆకుల శ్రీనివాస్, అసెంబ్లీ కన్వీనర్ అంకం మహేందర్, మండల అధ్యక్షులు పుప్పాల ఉపేందర్, బీజేపీ పట్టణ అధ్యక్షులు కీర్తి మనోజ్, మహిళా మోర్చా కన్వీనర్ బొప్పారపు సత్యవతి, బీజేపీ పట్టణ జనరల్ సెక్రటరీ కొండవేణి రమేష్, నాయకులు మాదాసు మురళి, బొందిగల సుమంత్, నాయకులు పిట్టల భూమన్న, అడిదెల మహేష్, నర్సయ్య, రవీందర్, తదితరులున్నారు.



ఖానాపూర్‌లో రాజమాతదేవి అహల్యబాయి హోల్కర్ జయంతి

తరతరాలకు స్ఫూర్తిదాయకం

నిర్మల్ కల్చరల్, మే 31 (ఆంధ్రజ్యోతి) : రాణి అహల్యబాయి హోల్కర్ తరతరాలకు స్ఫూర్తిదాయకమని జిల్లా బీజేపీ అధ్యక్షుడు రితేష్‌రాథోడ్ అన్నారు. శనివారం పార్టీ జిల్లా కార్యాలయంలో అహల్యబాయి హోల్కర్ 300 జయంతి నిర్వహించారు. ఆమె చిత్రపటా నికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. రితేష్ మాట్లాడుతూ... మొఘలులు ధ్వంసం చేసిన 9 జ్యోతిర్లింగాలను, వేలాది దేవాలయాలను తన సొంత డబ్బులు వెచ్చించి పునర్నిర్మించారని కాంగ్రెస్ పార్టీ అహల్యబాయి జీవితచరిత్రను పాఠ్యాంశంగా చేర్చలేని చరిత్ర హీనులన్నారు. మహిళల హక్కుల కోసం పోరాటం చేశారని, హిందువులను జాగృతం చేసి ఉక్కు మహిళగా హోల్కర్ నిలిచారని కొనియాడారు. అనంతరం పార్టీ కార్యాలయం నుండి ఊరేగింపు నిర్వహించారు. నాయకులు రాంనాథ్, అంజు కుమార్‌రెడ్డి, సామ రాజేశ్వర్‌రెడ్డి, మేడిసెమ్మె రాజు, సాగర్, ఆకుల కార్తీక్, సాయి, అలివేలు, ఆడెపు లలిత, వైద్య రజని, సుష్మారెడ్డి, కే. శ్రావణ్, అయ్యన్నగారి రాజేందర్, నారాయణ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సోన్ మండల కేంద్రంలో ..

సోన్, మే 31 (ఆంధ్రజ్యోతి) : సోన్ మండల కేంద్రంలో మండల బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో రాణి అహల్యబాయి హోల్కర్ 300 జయంతి కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి మండల సీనియర్ నాయకులు సరిగెల గంగన్న, జిల్లా కౌన్సిల్ మెంబర్ ముత్యపల్లి నరేష్, మండల అధ్యక్షులు మార గంగారెడ్డి, ఉపాధ్యక్షులు ఎలుగు విజయ, మద్దెల గంగాధర్, బోనగిరి గంగయ్య, కార్యదర్శులు పాల్గొన్నారు.

నచ్చన్ ఎల్లాపూర్ గ్రామ పంచాయతీని తనిఖీ చేసిన డీపీవో

కడెం, మే 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నచ్చన్ ఎల్లాపూర్ గ్రామ పంచాయతీ వివరాలు పక్కాగా నమోదు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి సూచించారు. కడెం మండలంలోని నచ్చన్ ఎల్లాపూర్ గ్రామ పంచాయతీని ఆకస్మికంగా డీపీవో శ్రీనివాస్ తనిఖీ చేశారు. అనంతరం పంచాయతీ రికార్డులు పరిశీలించారు. గ్రామంలోని మురికి కాలువలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. రానున్న వర్షాకాలన్ని దృష్టిలో పెట్టుకొని డ్రైనేజీ సమస్యలు రాకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి, సిబ్బంది పాల్గొన్నారు.



గ్రామ పంచాయతీ తనిఖీ చేస్తున్న డీపీవో

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

కడెం, మే 31 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరాలు రోడ్డు భద్రత నిబంధనల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కడెం ఏఎస్సై మాన్‌సింగ్ సూచించారు. కడెం మండలం అంబారిపేట గ్రామస్థులకు రోడ్డు భద్రత నిబంధనలు, సైబర్ నేరాల గురించి అవగాహన కల్పించారు. గుర్తు తెలియని మెసేజ్‌లకు, లింకులకు స్పందించి వ్యక్తిగత వివరాలు ఇవ్వవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో వంశీ, భీమ్‌రావు, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

కడెం, మే 31 (ఆంధ్రజ్యోతి) : కడెం మండలం నచ్చన్ ఎల్లాపూర్ గ్రామం లోని టీజీఎస్‌డబ్ల్యూఆర్ఎస్.. జేసీ విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించినందుకు ఇటీవల ప్రిన్సిపాల్ శకుంతలకు అవార్డు రావడంతో టీజీబీసీవైసీ సెక్రటరీ రమణ యాదవ్ శనివారం ప్రాన్సిపాల్ శంకుతలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో వేల్పుల మహేష్, బి. గంగన్న, పి. రవి, తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి క్రీడలకు ఎంపికైన అభినయకు ఆర్థిక సహాయం

లక్ష్మణచాంద, మే 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నర్సాపూర్(డబ్ల్యూ) గ్రామానికి చెందిన అభినయ ఇటీవల జరిగిన జాతీయస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికైంది. ఈ విషయం తెలుసుకున్న గ్రామీణ సపోర్ట్ ఫౌండేషన్ డైరెక్టర్ కడారి నరేష్ తన సిబ్బంది ద్వారా ఆమెకు శనివారం రూ. 5 వేలు ఆర్థికసహాయం అందజేసి సన్మానించారు. అభినయ సోన్ మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో పదవ తరగతి పూర్తి చేసింది. జూన్ 4 నుండి 7 వరకు గోవాలో జరుగనున్న జాతీయ స్థాయి జూనియర్ అండర్- 17 బాలికల బాక్సింగ్ పోటీల్లో తెలంగాణ రాష్ట్రం తరపున పాల్గొననుంది. ఈ కార్యక్రమంలో మేనేజర్ శ్రీనివాస్, సీఆర్పీ సుధాకర్, లెక్చరర్ హరీష్ కుమార్, గ్రామస్థులు పాల్గొన్నారు.

10న తైబజార్‌కు వేలం

భైంసా, మే 31 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ డివిజన్ కేంద్రమైన భైంసాలో ఏడాది కాలం పాటు తైబజార్ కోసం వేలం పాటను ఈ నెల 10వ తేదిన నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ రాజేష్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల వారు ఈ నెల 6వ తేది లోపు రూ. 10వేల రుసుముతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వేలం పాల్గొనే వారు మున్సిపల్ వ్యాపార లైసెన్స్ పొంద ఉన్న వారు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. తేది 16.06.2025 నుండి తేది. 31.03.2026 వరకు ఏడాది కాలం తైబజార్ కొనసాగుతుందన్నారు. మరిన్ని వివరాలకు మున్సిపల్ కార్యాలయంలోని రెవెన్యూ ఇన్స్‌పెక్టర్‌ను సంప్రదించాలని సూచించారు.

ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్మెంట్ యూనిట్‌కై స్థల పరిశీలన

ముథోల్, మే 31 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన ముథోల్‌లోని బాసర, భైంసా రహదారి పక్కన కంటి దవాఖాన సమీపాన ఎంపీడీవో శివ కుమార్, రెవెన్యూ అధికారులు స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్మెంట్ యూనిట్‌కై స్థలం పరిశీలన చేశారు.0

పదేళ్లలో సబ్‌ప్లాన్ నిధులు ఖర్చు చేయలేదు

- మేం వచ్చాక 17,169కోట్ల కేటాయింపు
- గిరిజనుల హక్కులు కాపాడేలా నల్లమల్ల డిక్లరేషన్ ఇచ్చాం: భట్టి విక్రమార్క
- గిరిజనుల హక్కులను రక్షించాలి: మీనాక్షి

కొత్తగూడెం, మే 31 (ఆంధ్రజ్యోతి): గత పదేళ్లలో రాష్ట్రాన్ని పాలించిన బీఆర్ఎస్ సర్కారు గిరిజనుల కోసం సబ్‌ప్లాన్ నిధులను ఏ మాత్రం ఖర్చు చేయలేదని, తాము అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.17,169కోట్లను కేటాయించామని డిప్యూటి సీఎం మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలోని కిన్నెరసానిలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న కాంగ్రెస్ తెలంగాణ ఆదివాసీ కార్యకర్తల సమ్మేళనం ముగింపు సమావేశం శనివారం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. ప్రజాప్రభుత్వంలో సబ్‌ప్లాన్ నిధులను పారదర్శకంగా ఖర్చు చేస్తున్నామని చెప్పారు. గిరిజనుల అవసరాలేంటో తెలుసుకునేందుకు ఆ వర్గాలకు చెందిన నాయకులను ఒకచోట చేర్చి శిక్షణ కార్యక్రమాలను ఏర్పాటు చేశామన్నారు. అడవి బిడ్డలు ఆత్మగౌరవంతో జీవించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఇందిరా సౌర జల గిరిజన వికాస పథకం తీసుకొచ్చిందని వెల్లడించారు. గిరిజనుల హక్కులు, ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు నల్లమల్ల డిక్లరేషన్ తీసుకొచ్చినట్లు ఆయన తెలిపారు. కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నాటరాజన్ మాట్లాడుతూ.. గిరిజనుల చట్టాలను, హక్కులను పరిరక్షించి వారిని అన్నిరంగాల్లో ముందు వరుసలో నిలపాలన్నారు. గిరిజనులకు రాజ్యాంగం కల్పించిన హక్కులన్నీ పరిరక్షించినప్పుడే వారు అభివృద్ధిలో ముందుకు వెళ్తారని, దీనికోసం కాంగ్రెస్ ఎల్లప్పుడు కృషి చేస్తుందన్నారు. పోడు భూముల్లో సాగు చేసుకుని జీవనం సాగించేందుకు అడవి బిడ్డలకు ఆర్థికంగా చేయూతనందించాలనిసూచించారు. పీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేష్‌గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత గిరిజనుల అభివృద్ధి, వారి సంక్షేమం కోసం రూ.కోట్లాది నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. నాడు ఇందిరాగాంధీ నుంచి ఇప్పటి సోనియాగాంధీ వరకు గిరిజనుల అభివృద్ధికోసం,వారిని అన్నిరంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు విశేషంగా కృషి చేశారని పేర్కొన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ గిరిజనుల అభివృద్ధికి, సంక్షేమానికి పెద్దపీట వేస్తామని తెలిపారు. రాష్ట్రంలో విలువైన ప్రభుత్వ భూములను కాపాడేందుకు భూభారతి చట్టాన్ని తీసుకొచ్చామని తెలిపారు.



పాల్వంచలో ఆదివాసీ కాంగ్రెస్ కార్యకర్తల సమ్మేళనంలో మాట్లాడుతున్న భట్టి

ప్రభుత్వ పనితీరుపై మీనాక్షి ఆరా

ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్యేలతో మీనాక్షి నటరాజన్ శనివారం పాల్వంచలోని జెన్కో అతిథిగృహంలో అంతర్గత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మీనాక్షి నటరాజన్ ఒక్కో ఎమ్మెల్యేతో వేర్వేరుగా మాట్లాడి.. వారి నియోజకవర్గాల్లో రాజకీయ పరిస్థితులు, కాంగ్రెస్ ప్రభుత్వ పని తీరుపై ప్రజల్లో ఉన్న అభిప్రాయాలు, తదితర వివరాలను అడిగి తెలుసుకున్నట్లు సమాచారం. ఈ క్రమంలో ఆయా ఎమ్మెల్యేలు ప్రభుత్వ పని తీరు బాగానే ఉందని, రుణమాఫీ, రైతు బంధు పథకం అందరికీ అందలేదన్న వ్యతిరేకత కొంత ఉందని ఆమె వివరించినట్టు తెలిసింది.

కొందరు బీజేపీ సీనియర్లతో కేసీఆర్‌కు సంబంధాలు



- ఆ కారణంగానే పార్టీ అధ్యక్ష పదవి నుంచి బండిని తప్పించారు
- గత ఎన్నికల్లో కేసీఆర్ చెప్పిన వారే బీజేపీ అభ్యర్థులు: మహేశ్ గౌడ్

కొత్తగూడెం, మే 31 (ఆంధ్రజ్యోతి): బీజేపీ, బీఆర్ఎస్ మధ్య లోపాయికారి ఒప్పందం కుదిరిందని, కొందరు బీజేపీ సీనియర్ నాయకులతో కేసీఆర్‌కు సంబంధాలున్నాయని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. ఆ సంబంధాల కారణంగానే బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి బండి సంజయ్‌ను తొలగించారన్నారు. రేపో.. మాపో.. బీజేపీలో బీఆర్ఎస్ విలీనం కావడం ఖాయమని జోస్యం చెప్పారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలోని కిన్నెరసాని గురుకుల పాఠశాల ఆవరణలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆదివాసీ గిరిజన కాంగ్రెస్ సమ్మేళనం ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం విలేకరులతో మహేశ్ గౌడ్ మాట్లాడారు. 'బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ చెప్పినట్టే గత ఎన్నికల్లో కేసీఆర్ చెప్పినట్టుగానే బీజేపీ తమ అభ్యర్థులను నిలబెట్టింది. బీజేపీకి తెలంగాణలో పునాదులు లేవు.. ఆ పార్టీ ఇక్కడ అధికారంలోకి రావడం కలే.. రాష్ట్రంలో కాంగ్రెస్ బలంగా ఉంది. అన్ని వర్గాల ప్రజలకు చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలతో పార్టీ బలోపేతమవుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల వల్ల.. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తప్పనిసరిగా కాంగ్రెస్ 90 సీట్లు గెలుచుకుంటుంది' అని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్.. ఒక్కటేనని బీజేపీ నేతలు చేస్తున్న ఆరోపణల్లో ఏ మాత్రం నిజం లేదని కొట్టిపారేశారు. బండి సంజయ్ మాటలను ప్రజలు నమ్మడం లేదని, ఆయన ఇంకా యువ మోర్చా నాయకుడిలా మాట్లాడటం సరికాదన్నారు.

అధికారంలో ఉన్నా లేకున్నా తెలంగాణ అభివృద్ధే లక్ష్యం: కేటీఆర్

హైదరాబాద్, మే 31(ఆంధ్రజ్యోతి): అధికారంలో ఉన్నా లేకున్నా తెలంగాణ అభివృద్ధి చెందాలన్నదే తమ అభిమతమని, పెట్టుబడుల కోసం ప్రయత్నిస్తామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. ఇంగ్లాండ్‌లోని వార్విక్ యూనివర్సిటీలో ప్రాగ్మటిక్ డిజైన్ సొల్యూషన్స్ లిమిటెడ్ (పీడీఎస్ఎల్) నాలెడ్జ్ సెంటర్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దిగ్గజ కార్పొరేట్ సంస్థలకు తెలంగాణ బిడ్డలు సేవలందించడం గర్వకారణం అన్నారు. పెట్టుబడులు వచ్చి తెలంగాణ యువతకు ఉపాధి అవకాశాలు దొరకాలని, అందుకోసం సర్వశక్తులు ఉపయోగిస్తామని చెప్పారు.

కేసీఆర్‌కు నోటీసులంటే.. తెలంగాణకు ఇచ్చినట్లే

ఆయనపై ఈగ వాలినా ఊరుకోం.. కాళేశ్వరం కమిషన్ నోటీసులకు వ్యతిరేకంగా 4న ఇందిరాపార్క్ వద్ద ధర్నా

- జాగృతి నూతన కార్యాలయం ప్రారంభం

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ అధినేత కేసీఆర్.. తెలంగాణ జాతిపిత అని, ఆయనకు నోటీసులు ఇవ్వడమంటే యావత్తు తెలంగాణకు నోటీసులిచ్చినట్లేనని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. కేసీఆర్‌పై ఈగ వాలినా తాము ఊరుకోబోమని హెచ్చరించారు. కేసీఆర్‌కు బీఆర్ఎస్ పార్టీ ఒక కన్ను అయితే.. తెలంగాణ జాగృతి మరో కన్ను అని తెలిపారు. కాళేశ్వరం కమిషన్ కేసీఆర్‌కు నోటీసులు ఇవ్వడాన్ని నిరసిస్తూ ఈ నెల 4న ఇందిరా పార్కు వద్ద మహాధర్నా చేపడుతున్నట్లు ప్రకటించారు. శనివారం బంజారాహిల్స్‌లోని తన నివాసం సమీపంలో తెలంగాణ జాగృతి నూతన కార్యాలయాన్ని కవిత ప్రారంభించారు. కుటుంబ సమేతంగా పూజలు నిర్వహించిన అనంతరం బీఆర్ అంబేద్కర్, మహాత్మా జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలే, ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాలకు పుష్పాంజలి ఘటించారు. అనంతరం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గోదావరి జలాల్లో 200 టీఎంసీల హక్కు తెలంగాణకు ఉండాలని కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు కట్టారని తెలిపారు. "కాళేశ్వరం ద్వారా ఏటా 20 లక్షల ఎకరాలకు నీళ్లు అందించినందుకు కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చారా? కోటి ఎకరాల మాగాణంగా తెలంగాణను చేసినందుకు నోటీసులు ఇచ్చారా ? రైతు బీమా, రైతు బంధు పథకాలను ప్రవేశపెట్టినందుకు ఇచ్చారా? తెలంగాణ ప్రజలకు మేలు చేసినందుకు ఇచ్చారా? అది కాళేశ్వరం కమిషనా? లేక కాంగ్రెస్ కమిషనా?"అని కవిత ధ్వజమెత్తారు. కేసీఆర్‌కు నోటీసులు ఇవ్వడం పట్ల ప్రతి తెలంగాణ బిడ్డ బాధపడుతున్నారని అన్నారు.

నీళ్లు తరలించుకుపోతుంటే మాట్లాడరేం?

ఏపీ సీఎం చంద్రబాబు బనకచర్ల ప్రాజెక్టు నిర్మించి తెలంగాణ నీళ్లను తరలించుకుపోతుంటే సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడని పరిస్థితి ఏర్పడిందని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం అంత బలహీనంగా ఎందుకున్నారని, పక్క రాష్ట్రాల ప్రయోజనాల కోసం ఎందుకు పనిచేస్తున్నారని ప్రశ్నించారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు నదుల అనుసంధానాన్ని తుపాకులగూడెం నుంచి చేపట్టేలా ప్రతిపాదించారని, కానీ.. ఆనాడు కేంద్ర ప్రభుత్వం ఒప్పుకోకుండా ఇచ్చంపల్లి నుంచి చేపడతామని చెప్పిందని అన్నారు. కానీ, ఇప్పుడు పోలవరం నుంచి 200 టీఎంసీల గోదావరి నీళ్లను తరలించే ప్రయత్నం జరుగుతోందని తెలిపారు. జూన్ 2 నాడు సీఎం రేవంత్‌రెడ్డి ఈ అంశంపై స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి కనీసం జై తెలంగాణ అనకపోవడం మన ఖర్మ అని, తెలంగాణ గ్రహచారం బాగాలేక రాష్ట్రానికి రేవంత్‌రెడ్డి సీఎం అయ్యారని కవిత వ్యాఖ్యానించారు. జై తెలంగాణ అనని వారికి, అమరవీరులకు నివాళులర్పించని వారికి సీఎం కుర్చీలో కూర్చొనే అర్హత లేదన్నారు. ఇప్పటికైనా రేవంత్ జై తెలంగాణ అనాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ పిడికిలెత్తి బయటికి వస్తేనే తెలంగాణ వచ్చిందని, దానివల్లే ఇవాళ అధికారంలో ఉన్నామన్న విషయాన్ని వారు గుర్తుంచుకోవాలని హితవు పలికారు. ఆ విషయాన్ని మరిచిపోయి కేసీఆర్‌కు నోటీసులివ్వడం దారుణమన్నారు. యువతకు స్వయం ఉపాధి కోసం ప్రారంభిస్తున్న రాజీవ్ యువ వికాసం పథకం పేరు మార్చాలని డిమాండ్ చేశారు. తెలంగాణకు ఎటువంటి సంబంధంలేని రాజీవ్‌గాంధీ పేరు పెట్టడం సరికాదన్నారు. అమరులు శ్రీకాంతచారి, యాదిరెడ్డి, ప్రజాకవి కాళోజీ, మాజీ ప్రధాని పీవీ నరసింహారావు పేరు పెట్టాలని సూచించారు. రాష్ట్ర శాసనసభ, శాసన మండలి ఆమోదించిన బీసీ బిల్లులను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆమోదించకుండా తాత్సారం చేస్తోందని కవత మండిపడ్డారు. ఇటీవల ప్రధాని మోదీని సీఎం రేవంత్ రెడ్డి కలిసిన సమయంలో ప్రాజెక్టుల గురించి మాట్లాడారు తప్ప.. బీసీ బిల్లు మీద మాట్లాడలేదని ఆరోపించారు. బీసీ బిల్లును డీప్ ఫ్రిడ్జ్‌లో పెట్టే ప్రయత్నం చేస్తే బీజేపీకి సెగ తాకేలా పోరాటం చేస్తామని హెచ్చరించారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించే వరకు జాగృతి పోరాటం చేస్తుందని అన్నారు.


జాగృతి కార్యాలయ ప్రారంభోత్సవం సందర్భంగా పూజలు చేస్తున్న కవిత

జాగృతి కమిటీల ఏర్పాటు..

మైనారిటీల హక్కుల కోసం కూడా జాగృతి పోరాటం చేస్తుందని కవిత ప్రకటించారు. జాగృతిలో మైనారిటీల హక్కుల కోసం ముస్లిం, సిక్కు, క్రిస్టియన్ విభాగాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. జాగృతి తరఫున ఎస్సీ, ఎస్టీ విభాగాన్ని ఏర్పాటు చేసి ఆ వర్గాల కోసం ఉద్యమిస్తామన్నారు. అయితే, తాము పోరాటాలు చేస్తుంటే కొంతమంది ఓర్వడం లేదన్నారు. తెలంగాణ కోసం బీజేపీ నాయకులు మాట్లాడకపోవడం దారుణమని, 8మంది ఎంపీలను గెలిపించినా కేంద్రం నుంచి రూపాయి తీసుకురాలేదని విమర్శించారు. గోదావరి జలాల్లో తెలంగాణ వాటాను కాపాడకపోతే తెలంగాణ జాగృతి పవర్ చూపిస్తామన్నారు. కాగా, తెలంగాణ జాగృతి కార్యాలయ కార్యదర్శిగా పొన్నమనేని బాలాజీరావును నియమిస్తున్నట్లు ఆ కార్యాలయం తెలిపింది.

బీజేపీతో పొత్తు ఉంటుందని ఏమార్చారు

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మాతో టచ్‌లోకి.. వచ్చినప్పుడల్లా కేసీఆర్ ఇదే చెప్పారు: సంజయ్



కరీంనగర్, మే 31(ఆంధ్రజ్యోతి, ప్రతినిధి): గతంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఆ పార్టీలోని చాలా మంది ఎమ్మెల్యేలు బీజేపీతో టచ్‌లోకి వచ్చారని.. అలా జరిగిన ప్రతిసారీ కేసీఆర్ ఎమ్మెల్యేలతో సమావేశమై కమలంతో పొత్తు పెట్టుకుంటామని చెప్పి వారిని కాషాయ గూటికి రాకుండా చేశారని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. బీఆర్ఎస్ అంటేనే అవినీతి పార్టీ అని, కవితను అరెస్టు చేయకుండా ఉండటానికి బీజేపీతో కలవడానికి బీఆర్ఎస్ ప్రయత్నించిందని చెప్పారు. కుటుంబ పార్టీని తాము దగ్గరకు రానివ్వలేదని తెలిపారు. శనివారం కరీంనగర్‌లో సంజయ్ విలేకరులతో మాట్లాడారు. ఈటల రాజేందర్, హరీశ్‌రావు భేటీ విషయం తెలియదని, ఇదంతా కాంగ్రెస్ ఆడుతున్న డ్రామా అని తెలిపారు. కవిత విషయంలోనూ అదే డ్రామా నడుస్తోందని చెప్పారు కల్వకుంట్ల ఆర్ట్స్ క్రియేషన్స్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నిర్మాణ దర్శకత్వంలో కవిత పాత్రధారిగా చార్‌పత్తా సినిమా నడుస్తోందన్నారు. కవిత ఎపిసోడ్‌తో ప్రజలకు మేలు జరుగుతుందా..? అని ప్రశ్నించారు. ఆరు గ్యారెంటీలపై చర్చ జరగకుండా చిట్‌చాట్‌ల పేరుతో ప్రజల దృష్టిని మళ్లించే కుట్ర జరుగుతోందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు ముమ్మాటికీ దేశద్రోహమే అని సంజయ్ అన్నారు. సైన్యం ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేలా, పాకిస్తాన్ ఉగ్రవాదులను పెంచి పోషించేలా ఆయన వ్యాఖ్యలు ఉన్నాయని మండిపడ్డారు. బీఆర్ఎస్ అవినీతి, కాళేశ్వరం ప్రాజెక్టు, డ్రగ్స్, ఫోన్ ట్యాపింగ్, ఫాంహౌస్, ఫార్ములా-ఈ రేసు కేసుల విషయంలో అరెస్టులు ఉంటాయని చెప్పి కాంగ్రెస్ మాట తప్పిందని అన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి బీజేపీని అధికారంలోకి రాకుండా అడ్డుకోవాలని చూస్తున్నాయని, వాళ్లెన్ని కుట్రలు చేసినా అది జరగదని చెప్పారు. వేములవాడ రాజన్న ఆలయ పరిధిలో 18 గోవులు చనిపోవడంపై అధికారులు వ్యవహరిస్తున్న తీరు సరికాదని సంజయ్ అన్నారు.

అసంపూర్తి బ్రిడ్జిలతో ఖరీఫ్ పనులు కొనసాగేదెలా!


చెరువులా మారిన పంట పొలాలు


సిర్సన్నలో వర్షానికి ప్రమాదకరంగా మారిన రహదారి


సిర్సన్నలో నత్త నడకన కొనసాగుతున్న బ్రిడ్జి నిర్మాణ పనులు

బేల, మే 31 (ఆంధ్రజ్యోతి): మండలంలో నాలుగైదు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు సిర్సన్న గ్రామానికి చెందిన రైతుల పంట పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. దీనికి ప్రధాన కారణం అసంపూర్తి బ్రిడ్జి నిర్మాణ పనులు. అంతరాష్ట్ర రహదారి 353 బీ బ్రిడ్జి నిర్మాణ పనులు నత్త నడకన కొనసాగడం మూలంగా రైతులకు శాపంగా మారింది. నిన్న రాత్రి కురిసిన భారీ వర్షానికి నీరు మొత్తం రైతుల పొలంలో చేరి చెరువుల తలపిస్తున్నాయి. దీంతో రైతులు గుత్తేదారునిపై మండిపడుతున్నారు. ఈ సందర్భంగా సిర్సన్న గ్రామ రైతులు మాట్లాడుతూ అంతరాష్ట్ర రహదారి 353 బీకాం ట్రాక్టర్ బ్రిడ్జి పనులు నమ్మేదిగా చేయడం మూలంగా రైతుల పంట పొలాలు వర్షానికి దెబ్బ తింటున్నాయని మండిపడుతున్నారు. దీంతో రైతుల పంట పొలాల్లోకి నీరు చేరడం మూలంగా పొలంలో ఉన్న బోరు బావి కూలిపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు ఖరీఫ్ సాగు కోసం రైతులు విత్తనాలు విత్తడానికి సిద్ధం కావాల్సిన తరుణంలో ఇలా పొలంలో వరద నీరు చేరడంతో పనులు ఎలా ప్రారంభించాలని ఆవేదన వ్యక్తం చేశారు. బ్రిడ్జి నిర్మాణ పనులు సదరు గుత్తేదారు వెంటనే పూర్తి చేయాలని లేనియెడల జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిర్సన్న గ్రామ రైతులు పాల్గొన్నారు.


ధన్నూర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించాలంటూ ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు

ప్రైవేట్ పాఠశాలలు వద్దు.. ప్రభుత్వ స్కూళ్లు ముద్దు!

బోథ్, మే 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దన్నూర్ గ్రామ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులను చేర్పించేందుకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రావుల శంకర్ ఆధ్వర్యంలో ముందస్తుగానే బడిబాట కార్యక్ర మాన్ని నిర్వహించారు. గ్రామంలో తిరుగుతూ ఈ సంవత్సరం పాఠశాలలోని విద్యార్థులు మోడల్ స్కూల్‌కు ఎంపికైన విధానాన్ని వివరిస్తూ తమ పాఠశాలలో విద్యార్థులను చేర్పించాలని సూచిస్తున్నారు. అంతేగాక ప్రభుత్వ పాఠశాల ప్రైవేట్‌కు దీటుగా ఉందని ప్రైవేట్ పాఠశాలలకు పంపించి డబ్బులు వృథా చేసుకోవద్దని విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు. ఎలాంటి ఖర్చులేకుండా ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి తే వారిని ఉన్నతులుగా తీర్చిదిద్దే బాధ్యత మనది అంటూ ఉపాధ్యాయులు తల్లి దండ్రులకు భరోసా ఇస్తున్నారు. మరోవైపు పాఠశాల పరిసరాలను వివిధ రకాల రంగులతో ఆకర్ష ణీయంగా తీర్చిదిద్ది ప్రైవేట్ పాఠశాలలను మరిపించేవిధంగా తయారుచేశారు. ఏదిఏమైనా ముందస్తుగా ఉపాధ్యాయులు విద్యార్థుల కోసం పర్యటించడం వల్ల విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు.

తెలంగాణ చరిత్ర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా న్యూ వెల్మల్ వాసి



సోన్, మే 31 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ చరిత్ర పరిశోధన ముఖ్య భూమిక పోషిస్తున్న తెలంగాణ హిస్టరీ కాంగ్రెస్‌కు న్యూ వెల్మల్ గ్రామస్థుడు అంకం జయప్రకాష్ ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. తెలంగాణ చరిత్ర పరిశోధనకు ప్రోత్సాహం ఇవ్వడం, చారిత్రక విశ్లేషకు మార్గనిర్దేశం చేయడం, చరిత్ర రచనలోని వాస్త వాలను పరిరక్షించడం వంటి విషయాలలో తెలంగాణ చరిత్ర కాంగ్రెస్ కృషి చేస్తుంది. తెలంగాణ చరిత్రపై శాస్త్రీయ పరిశోధనను ప్రోత్సహిస్తూ, చరిత్ర రచనను వాస్తవ ఆధారంగా కొనసాగించడం చరిత్ర కాంగ్రెస్ ముఖ్య ఉద్దేశం. అంతేకాకుండా తెలంగాణలోని భిన్న మతాలు, జాతులు, సామాజిక వర్గాల చరిత్రను సమానంగా ప్రాధాన్యంతో పరిశీలిస్తూ, చరిత్ర రచనలో వక్రీకరణను నిరోధించడం చరిత్ర కాంగ్రెస్ ప్రధాన లక్ష్యం. అదే సమయంలో చరిత్రను అందుబాటులోకి తేవడానికి టీహెచ్‌సీ కృషి చేస్తుంది.




రైలులో నుంచి యూరియా, డీఏపీ, పొటాష్, ఎరువులను లారీలో ఎక్కిస్తున్న దృశ్యం



ఎరువులొచ్చేశాయ్

ఖరీఫ్ సాగు కోసం సిద్ధమవుతున్న అన్నదాతకు మొదట్లోనే సానుకూలాంశాలు ఎదురవుతున్నాయి. ఇప్పటికే ఈ సీజన్‌కు సంబంధించి సరిపడా విత్తనాలు మార్కెట్లో లభ్యమవుతుండగా తాజాగా యూరియా, డీఏపీ, పోటాష్ వంటి ఎరువులు సైతం జిల్లాకు చేరుకుంటున్నాయి. ఆయా ప్రాంతాల నుంచి శనివారం ప్రత్యేక రైలులో ఎరువులు ఆదిలాబాద్‌కు చేరుకోగా అక్కడి నుంచి వివిధ గోదాములకు తరలించేందుకు లారీలు వరుసకట్టాయి.

● (ఆంధ్రజ్యోతి, ఆదిలాబాద్ స్టాఫ్ ఫోటోగ్రాఫర్)

పొట్టపెల్లి(కే)లో అంగన్‌వాడీ ఉపాధ్యాయుల సమావేశం

లక్ష్మణచాంద, మే 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొట్టపెల్లి(కే) గ్రామంలో అంగన్‌వాడీ ఉపాధ్యాయుల సమావేశాన్ని శనివారం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణకు సంబంధించి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పసుపుల భాగ్యవతి పలు సలహాలు, సూచనలు అందజేశారు. అంగన్‌వాడీ కేంద్రాల పని తీరుకు సంబంధించిన నివేదికలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అంగన్‌వాడీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


పొట్టపెల్లి(కే)లో పాల్గొన్న అంగన్‌వాడీ ఉపాధ్యాయులు

ఫటా.. ఫట్...

భూ సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు

● సరిత, తహసీల్దార్, లక్ష్మణచాంద



ఆంధ్రజ్యోతి: రెవెన్యూ సదస్సుల ముఖ్య ఉద్దేశం ఏమిటి?

తహసీల్దార్: రైతులకు సంబంధించిన భూ సమస్యలను పరిష్కారం చేయటం కోసమే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నాం. అధికారులు తమ గ్రామాలకే వచ్చి దరఖాస్తులు స్వీకరిస్తారు. తమ సమస్యల పరిష్కారం కోసం రైతులు ఈ సదస్సులలో దరఖాస్తు చేసుకోవచ్చు.

ఆంధ్రజ్యోతి: రెవెన్యూ సదస్సులు ఎప్పటి నుంచి నిర్వహిస్తారు?

తహసీల్దార్: జూన్ 3వ తేదీ నుండి 20వ తేదీ వరకు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. అందుకు సంబంధించిన షెడ్యూల్‌ను రెండు రోజుల్లో మీడియాకు విడుదల చేస్తాం.

ఆంధ్రజ్యోతి: రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులలో గల భూ సమస్యలను ఎప్పటిలోగా పరిష్కరిస్తారు...?

తహసీల్దార్: ఆగస్టు 14వ తేదీలోగా పరిష్కరించాలని ప్రభుత్వం ఆదేశించింది. క్లిష్టమైన సమస్యలు ఉంటే కొంత సమయం పట్టవచ్చు. ఏ సమస్యనైనా ప్రభుత్వ ఆదేశానుసారం త్వరితగతిన పరిష్కరించే ప్రయత్నం చేస్తాం.

ఆంధ్రజ్యోతి: ధరణి పోర్టల్‌కు భూ భారతి పోర్టల్‌కు తేడా ఏమిటి...?

తహసీల్దార్: ధరణి పోర్టల్‌లో అనుభవదారు కాలం ఉండేది కాదు. భూ భారతి పోర్టల్‌లో అనుభవదారు కాలం పెట్టారు. అలాగే ధరణి సాఫ్ట్‌వేర్‌లో భూమి రికార్డుల సమాచారం నమోదు చేసిన సమయంలో జరిగిన పొరపాట్లను భూ భారతి పోర్టల్‌లో సరిచేసుకునే అవకాశం ఉం ది. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగంచేసుకోవాలి.

● (లక్ష్మణచాంద, ఆంధ్రజ్యోతి)

నకిలీ విత్తనాలు, పురుగు మందులు విక్రయిస్తే కఠిన చర్యలు: సీఐ


కనకాపూర్‌లో ఫర్టిలైజర్ దుకాణాన్ని తనిఖీ చేస్తున్న సీఐ గోవర్దన్ రెడ్డి

లక్ష్మణచాంద, మే 31 (ఆంధ్రజ్యోతి) : నకిలీ విత్తనాలు, నకిలీ పురుగు మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సోన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గోవర్ధన్ రెడ్డి హెచ్చరించారు. మండలంలోని కనకాపూర్ గ్రామంలో గల ఫర్టిలైజర్ షాప్‌ను శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. దుకాణంలో రికార్డులను, విత్తనాలు, పురుగు మందులను పరిశీలించారు. ఎవరైనా నకిలీ విత్తనాలు, పురుగు మందులు విక్రయిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు ఎస్సై జి.శ్రీనివాస్, తహసీల్దార్ సరిత, వ్యవసాయ అధికారి వసంత్ రావు, తదితరులున్నారు.



'యువ వికాసం'పై.. ఆశలు ఆవిరి!

- జిల్లాలో లక్షలోపు దరఖాస్తులకే మొదట మోక్షం
- తొలి విడతలో కొందరికే పథకం వర్తింపు
- సిబిల్ స్కోర్‌ను బట్టి లబ్ధిదారుల ఎంపిక
- టార్గెట్‌కు అనుగుణంగా సిద్ధమవుతున్న ఫైనల్ జాబితా
- రిజర్వేషన్ ప్రకారమే ఎస్సీ లబ్ధిదారుల ఎంపిక
- 2న ఎంపికైన లబ్ధిదారులకు మంజూరు పత్రాలు
- జిల్లావ్యాప్తంగా అధికారిక లెక్కల ప్రకారం 47,806 దరఖాస్తులు

ఆదిలాబాద్, మే 31(ఆంధ్రజ్యోతి): ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకంపై ఆశలు ఆవిరవుతున్నాయి. యువతకు ఉపాధి అవకాశాలను కల్పించి వారిని ఆర్థికంగా మరింత బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకానికి శ్రీకారం చుట్టింది. దీంతో జిల్లాలో నిరుద్యోగ యువతీ, యువకులు వేలల్లో దరఖాస్తులు చేసుకున్నారు. జిల్లావ్యాప్తంగా 47,806 దరఖాస్తులు వచ్చినట్లు అధికారిక లెక్కల ప్రకారం తెలుస్తుంది. ఈ పథకం కింద రూ.50 వేల నుంచి రూ.4 లక్షల వరకు రుణాన్ని అందించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. అయితే తొలివిడతలో రూ.లక్ష లోపు రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికే మంజూరు పత్రాలను అందించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో మిగితా దరఖాస్తుదారులు నిరాశకు గురవుతున్నారు. రూ.లక్షకు పైబడి రూ.4లక్షల వరకు దరఖాస్తు చేసుకున్న రుణాల మంజూరు ఎప్పుడు? అనే దానిపై స్పష్టత లేకపోవడం అయోమయ పరిస్థితులకు దారి తీస్తుంది. మండలాల వారీగా నిర్ణయించిన టార్గెట్ ప్రకారం అర్హులైన లబ్ధిదారుల కోసం అధికారులు కసరత్తు చేస్తున్నారు. అయితే ఎస్సీ రిజర్వేషన్ ప్రకారమే దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ను ఎంపిక చేస్తున్నారు. ఎస్సీ సామాజికవర్గం నుంచి వచ్చిన దరఖాస్తుల ను మూడు విభాగాలుగా విభజించారు. మొదటి క్యాటగిరి వారికి 6.67 శాతం రిజర్వేషన్, రెండవ క్యాటగిరి వారికి 60 శాతం, మూడవ క్యాటగిరి వారికి 33.33 శాతం రిజర్వేషన్‌ని కల్పిస్తూ ఈ పథకం కింద యూనిట్లను మంజూరు చేస్తున్నారు. ఫైనల్ జాబితా సిద్ధం కాగానే జూన్ 2న రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ఎంపికైన లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందించనున్నారు.

రూ.50 వేల వరకు..

వచ్చిన దరఖాస్తులు	2,910
టార్గెట్	4,746
యూనిట్ల మంజూరు	470

రూ..లక్ష వరకు..

వచ్చిన దరఖాస్తులు	4,101
టార్గెట్	3,293
యూనిట్ల మంజూరు	544

మొదట 1,014 మందికే..

జిల్లాలో రూ.50 వేల నుంచి రూ.లక్ష లోపు రుణాల కోసం 7,011 మంది దరఖాస్తు చేసుకున్నారు. కానీ మొదటి విడతలో కొందరికే మంజూరు పత్రాలను అందించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. రూ.50 వేల రుణాల కోసం 2,910 దరఖాస్తులు రాగా.. 470 యూనిట్లను మాత్రమే మంజూరు చేశారు. అలాగే రూ.లక్ష లోపు వరకు రుణాల కోసం 4,101 దరఖాస్తులు రాగా.. 544 యూనిట్లకు ప్రభుత్వం మంజూరు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. దీంతో 1,014 మందికి తొలివిడతలో మంజూరు పత్రాలను అందించనున్నారు. ఆపైగా వచ్చిన దరఖాస్తులను రెండవ విడతలో పరిశీలించే అవకాశం కనిపిస్తుంది. అన్ని రకాల అర్హతలు ఉన్నవారికే మంజూరు పత్రాలను అందించే అవకాశం కనిపిస్తుంది. అయితే రాజకీయ జోక్యం పెరిగిపోవడంతో అధికార పార్టీ నేతలు సూచించిన వారికే రుణాలను అందించే అవకాశం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

యూనిట్ మంజూరుకు సిబిల్ లింక్

రాజీవ్ యువ వికాసం పథకానికి సిబిల్ స్కోర్‌ను లింక్ చేస్తూ అధికారులు లబ్ధిదారుల ఎంపికను చేపడుతున్నారు. దీంతో సగం మందికి పైగా కనీస స్థాయిలో సిబిల్ స్కోర్ రావడం లేదని తెలుస్తుంది. బ్యాంక్ సిబిల్ స్కోర్‌ను సాకుగా చూపుతు అర్హుల జాబితా నుంచి అధికారులు తొలగిస్తున్నారు. మొదట రాజీవ్ యువ వికాసం పథకానికి సిబిల్ స్కోర్ వర్తించదని ప్రభుత్వం ప్రకటించిన మళ్లీ సిబిల్ స్కోర్‌ను పరిగణలోకి తీసుకోవడంపై నిరుద్యోగ యువతలో ఆందోళన వ్యక్తమవుతుంది. సిబిల్ స్కోర్ ఉంటే ప్రభుత్వంతో పని లేకుండా బ్యాంకులే రుణాలు ఇచ్చేందుకు ముందుకొస్తున్నాయని చెబుతున్నారు. భారీగా వచ్చిన దరఖాస్తులను ఏరివేసేందుకే ప్రభుత్వం సిబిల్ స్కోర్ నిబంధనను తీసుకొచ్చిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. యూనిట్ మంజూరుకు సిబిల్‌తో లింకు పెట్టడంతో చాలా మంది యువతీ, యువకులు రాజీవ్ యువ వికాసంపై ఆశలు వదులుకుంటున్నారు.

టార్గెట్‌కు మించకుండా..

ప్రభుత్వం విధించిన టార్గెట్‌కు మించకుండా అధికారులు లబ్ధిదారుల ఫైనల్ జాబితాను సిద్ధం చేస్తున్నారు. మండలాల వారీగా టార్గెట్ విధించడంతో అధికారులు లబ్ధిదారుల ఎంపికపై కసరత్తు చేస్తున్నారు. రూ.50 వేల వరకు రుణాలపై 4,746 టార్గెట్‌ను విధించారు. అలాగే రూ.లక్ష వరకు 3,293 టార్గెట్‌తో ముందుకెళ్తున్నారు. అయితే మంజూరు యూనిట్లు మాత్రం వెయ్యిలోపే కనిపిస్తున్నాయి. కొన్ని మండలాల్లో టార్గెట్‌కు మించిన దరఖాస్తులు రావడంతో అనర్హులను తొలగించేందుకు అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. దీంతో అధికారుల



(తరువాయి 6వ పేజీలో...)



పవర్ ప్రజంటేషన్ ద్వారా తెలంగాణలో గిరిజన విద్యకు జరుగుతున్న కార్యక్రమాలను వివరిస్తున్న ఎమ్మెల్యే బొజ్జు పటేల్

తెలంగాణలో గిరిజన విద్యకు పెద్దపీట

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్

ఉట్నూర్, మే 31(ఆంధ్రజ్యోతి): ఆదివాసీల జీవితాల్లో మార్పు రావాలంటే అది కేవలం నాణ్యమైన విద్యతోనే సాధ్యమవుతుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ పేర్కొన్నారు. శనివారం ఒడిశా రాష్ట్రంలోని కియోంఝర్ పట్టణ కేంద్రంలో గోండు సాంస్కృతిక సమాజ్ ఆధ్వర్యంలో విద్య దాని ప్రాముఖ్యత అనే అంశంపై నిర్వహించిన సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న విద్యా సదుపాయాల గురించి ఎమ్మెల్యే వివరించారు. రాష్ట్రంలో విద్యా రంగంలో అనేక సంస్కరణలు తీసుకొచ్చి సబ్బండ వర్గాలకు గుణాత్మక విద్యను అందించేందుకు తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయని, ప్రాథమిక స్థాయిలోనే విద్యార్థులను తరగతి గదులకు పరిమితం చేసే విధంగా అమలు చేస్తున్న విద్యా విధానాన్ని ఆయన వివరించారు. ముఖ్యంగా ఆదివాసీ ఏజెన్సీ ప్రాంతాల్లో ఆదివాసీ విద్యార్థిని, విద్యార్థులకు విద్యబోజన వసతి సౌకర్యాలు కల్పించడంతో పాటు ఆశ్రమ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థిని విద్యార్థుల ఆరోగ్య విషయాల పై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో గోండు సాంస్కృతిక సమాజ్ ఒడిశా రాష్ట్ర అధ్యక్షుడు కాగేశ్వర్‌నాయక్, ఉపాధ్యక్షుడు పూర్ణ చందర్, ప్రధాన కార్యదర్శి జోగేంద్రనాయక్, సంయుక్త కార్యదర్శి అర్జున్ చరణ్‌నాయక్, ప్రముఖులు, విద్యావేత్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఎల్లుండి నుంచి రెవెన్యూ సదస్సులు

ఉట్నూర్, మే31: (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారం కోసం మండలంలో జూన్ 3నుంచి 20వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని ఇన్‌చార్జి తహసీల్దార్ జాదవ్‌అమృత్‌లాల్ తెలిపారు. 3 న అందోలి, సాకెరగంగాపూర్, 4న పులిమడుగు, సాలెవాడ(కె), రాంపూర్(కె), 5న నర్సాపూర్(బి), నర్సాపూర్(కె), దుర్గాపూర్, రామ్‌లింగంపేట్, 6న చింతకర్ర, గొట్టి, తేజాపూర్, హీరాపూర్(జె), 9న ఎంకా, నాగపూర్, బీర్సాయిపేట్, 10న వడోని, చాందూరి, 11న ఉమ్రి, ఎందా, హస్నాపూర్, 12న షాంపూర్, దంతన్‌పల్లి, 13న లక్కేటిపేట, నర్సాపూర్(జె), కామాయిపేట్, 16న వడగల్‌పూర్(బి), వడగల్పూర్(కె), ఘన్పూర్, 17న తాండ్ర, సాలెవాడ(బి), లక్కారం, 18న కోపర్గాడ్, గంగన్నపేట్, 19న హీరాపూర్(డి), భూపేట, బలాన్పూర్, 20న ఉట్నూర్‌లలో రెవెన్యూ సదస్సులు ఉంటాయన్నారు. ఒక బృందంలో తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్‌తో పాటు గిరిధర్ అనూష్, జూనియర్ అసిస్టెంట్ రామకృష్ణ, రికార్డు అసిస్టెంట్ ఆడెల్లు, ఓఎస్ ఇందూర్‌లు, రెండవ బృందంలో తహసీల్దార్ జాదవ్ అమృతలాల్, గిర్ధావర్ అనిత, సీనియర్ అసిస్టెంట్ ప్రవీణ్, జూనియర్ అసిస్టెంట్ శంకర్, రికార్డు అసిస్టెంట్ రాజేశ్వర్, ఓఎస్ వందనలు ఉంటారన్నారు. ఉదయం 10గంటల నుంచి ఒంటిగంట వరకు మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఐదు గంటల వరకు రెవెన్యూ సదస్సులు ఉంటాయన్నారు.



బ్యాంకు ఎదుట నిరసన తెలుపుతున్న ఖాతాదారులు

ఈ బ్యాంకు మేనేజర్ మాకొద్దు!

- దేగామలో ఖాతాదారుల నిరసన

ఇచ్చోడ, బజార్‌హత్నూర్ 31(ఆంధ్రజ్యోతి): 'తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ ఖాతాదారులతో దురుసుగా మాట్లాడుతున్నారని.. ఆయనను ఇక్కడి నుంచి బదిలీ చేయాలని, ఆ మేనేజర్ మాకొద్దని' బజార్‌హత్నూర్ మండలం దేగామ గ్రామస్థులు శనివారం నిరసన వ్యక్తం చేశారు. బ్యాంకు మేనేజర్ హోదాలో ఉండి ఇష్టారీతిన మాట్లాడుతున్నారని.. ఎందుకని ప్రశ్నిస్తే నేనింతే.. మీ ఇష్టమున్న చోట చెప్పుకోండి అంటూ ఖాతాదారులను బెదిరింపులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. ఖాతాదారులతో దురుసుగా మాట్లాడే మేనేజర్‌ను ఇక్కడి నుంచి బదిలీ చేయాలని దేగామ గ్రామస్థులు, ఖాతాదారులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, ఖాతాదారులు మేకల వెంకన్న, బొడ్డు భోజన్న, పొశపు గణపతి, మడిగే రమణ, సాయిరాం, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల నిరసన

ఆదిలాబాద్, మే 31(ఆంధ్రజ్యోతి): జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో పలువురు జూనియర్ లెక్చరర్లు నల్లబ్యాడ్జిలతో నిరసన తెలిపారు. ఇంటర్మీడియట్ మూల్యాంకన కేంద్రానికి నల్ల బ్యాడ్జిలతో హాజరై మధ్యాహ్న భోజన విరమణ సమయంలో శాంతియుతంగా నిరసన తెలిపారు. వార్షిక ఇంక్రిమెంట్ మంజూరు చేసే విషయంలో తెలంగాణ రాష్ట్రంలోని డీడీఓలకు ఇంటర్మీడియట్ వ్యవస్థలోని కొందరు వ్యక్తులు తప్పుడు సమాచారం ఇచ్చి వార్షిక ఇంక్రిమెట్ విషయంలో అడ్డుపుల్ల వేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా కొన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో డీడీఓలు వార్షిక ఇంక్రిమెంట్ మంజూరు చేయగా మరికొందరు జాప్యం చేస్తున్నారని పేర్కొన్నారు. ఉద్యోగ నిబంధనల ప్రకారం రావాల్సిన వార్షిక ఇంక్రిమెంట్‌ను మంజూరు చేయకపోతే న్యాయపరమైన పోరాటం చేస్తామని పేర్కొన్నారు. ఇందులో పలువురు జూనియర్ లెక్చరర్లు, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం

ఉట్నూర్, మే31 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ రక్షణతోనే ప్రకృతి బాగుంటుందని ప్రతీఒక్కరు పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేయాలని ఉట్నూర్ ఇన్‌చార్జీ ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ శిలానంద్ అన్నారు. శనివారం ఉట్నూర్ అటవి రేంజ్ ఆధ్వర్యంలో తుకారం ఎక్స్‌రోడ్డు నుంచి ఉట్నూర్, నార్నూర్ వైపు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ పర్యావరణ పరిరక్షన దినం పురస్కరించుకుని ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అడవులతోనే ప్రకృతి సమతుల్యంగా ఉంటుందని తద్వారా వర్షాలు సమృద్ధిగా వస్తాయని అన్నారు. అడవులు అంతరించిపోతే వర్షాలు కురియక రైతులు ప్రజలు నీటి ఎద్దడి ఎదుర్కొవాల్సి వస్తుందని అన్నారు. అడవుల సంరక్షణ కోసం ప్రభుత్వం మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రతి ప్రజలందరు మొక్కలు నాటాలని, అడవులు అంతరించి పోకుండా చూసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్లు ప్రేమ్‌సింగ్, గోపాల్ నాయక్, జె.సుదర్శన్, జి.సుదర్శన్, శంకర్, బీట్ ఆఫీసర్లు కళ్యాణి, మహేశ్వరి, సుజాత, సునిల్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

డీలర్లు సమయపాలన పాటించాలి

సోనాల, మే 31(ఆంధ్రజ్యోతి): రేషన్ డీలర్లు సమయపాలన పాటించాలని తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చౌకధరల దుకాణాల ద్వారా అర్హులైన పేదలకు అందించే రేషన్ బియ్యం పంపిణీలో డీలర్ సమయపాలన పాటించాలని సూచించారు. అంతేకాకుండా ప్రతీనెల 1వ తేదీ నుంచి సరైన సమయంలో పంపిణీ చేయాలన్నారు. దుకాణాల్లో రేషన్ డీలర్ పేరు, మొబైల్ నెంబర్‌స్టాక్ నిల్వలు, పంపిన వివరాలతో బోర్డులు నిర్వహించాలని చౌకదారుల దుకాణం చిరునామా తెలిసేలా బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. లబ్ధిదారులకు ఇబ్బంది తలెత్తకుండా రేషన్ పంపిణీ చేయాలని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గిరిద్వర్ శ్యాంసుందర్, డీలర్లు ఎర్రన్న, దేవదాస్, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జొన్నల కొనుగోళ్లు

తాంసి, మే 31(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సహకార సొసైటీ ఆధ్వర్యంలో గత 40 రోజులుగా కొనుగోలు చేస్తున్న జొన్నల కొనుగోలు శనివారంతో ముగిశాయి. ఇప్పటి వరకు సుమారు 70వేల క్వింటాళ్లను కొనుగోలు చేశారు. గత మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో కొద్దిపాటి జొన్నలు తడిసినప్పటికీ ఆరబెట్టిన తరువాత వాటిని కొనుగోలు చేశారు. మొత్తం మీద జొన్నల కొనుగోళ్ళు ముగియడంతో అటు సంబంధిత అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

'రేపు జొన్న డబ్బుల కోసం ధర్నా'

తాంసి, మే 31(ఆంధ్రజ్యోతి): జొన్నలు అమ్మి 40 రోజులు కావొస్తున్న ఇంకా రైతుల ఖాతాలో డబ్బులు జమ కాలేదు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై సోమవారం తాంసి, భీంపూర్, తలమడుగు మండల రైతులతో కలిసి సుంకిడి అంతర్ రాష్ట్ర రహదారిపై ధర్నా నిర్వహించ తలపెట్టినట్లు బీఆర్ఎస్ మండల కన్వీనర్ రమణ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల రైతులకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని అన్నారు. జొన్నలు అమ్మిన వారం రోజుల్లోగా డబ్బులు జమ చేయాల్సి ఉన్నా.. ఎందుకు రైతుల ఖాతాలో జమ చేయడం లేదని ప్రశ్నించారు. ఇందులో కృష్ణ, అశోక్, రఘు, తదితరులు పాల్గొన్నారు.

మినీ గురుకులాల్లో దరఖాస్తులకు ఆహ్వానం : రీజినల్ కో ఆర్డినేటర్

నేరడిగొండ, మే 31 (ఆంధ్రజ్యోతి): మినీ గురుకులం గుత్పాల బాలికలు అడ్మిషన్లు కోసం దరఖాస్తు మొదలయ్యాయని రీజినల్ కోఆర్డినేటర్ ఆగస్టీన్ తెలిపారు. 1వ తరగతిలో 30 సీట్లు, 2వ తరగతిలో 4 సీట్లు, 5వ తరగతిలో 8 సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, జూన్ 9న లాటరీ పద్ధతిలో ఎంపిక జరుగుతుందని తెలిపారు. ఆధార్ కార్డు, ఫొటో, రేషన్ కార్డు, ఆదాయం, కుల ధ్రువీకరణ పత్రాలు తేవాలని, ఖాళీలు భర్తీ చేయుటలో పీవీటీజీ, గిరిజన విద్యార్థులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని పాఠశాల ప్రధాన అధికారి గోవర్ధన్, ప్రధానోపాధ్యాయులు అనురాధ తెలిపారు.

ప్రీ ప్రైమరీ స్కూళ్లల్లో డీపీఎస్ఈ కోర్సు చేసిన వారిని నియమించాలి

నేరడిగొండ, మే 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసే తెలంగాణ ఫౌండేషన్ స్కూల్స్/ప్రీ ప్రైమరీ పాఠశాలల్లో, డీఎస్సీలో ప్రీ ప్రైమరీ టీచర్లుగా రెండు సంవత్సరాల (డిప్లొమా ఇన్ ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్) డీపీఎస్ఈ కోర్సు పూర్తి చేసిన వారినే నియమించాలని తెలంగాణ డిప్లొమా ఇన్ ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్ స్టూడెంట్స్ అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సంఘం వైస్ ప్రెసిడెంట్ జాదవ్ శ్రీకాంత్, ముఖ్య కార్యదర్శి ఆకుల సురేష్, రెవెన్యూ, పౌర సరఫరా, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌ను శనివారం హైదరాబాద్‌లో కలిసి తమ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.

ముగిసిన ఐపీఎల్ క్రికెట్ పోటీలు

ఇచ్చోడ, మే31, (ఆంధ్రజ్యోతి): ఇచ్చోడలోని గిరిజన గురుకుల బాలుర పాఠశాల మైదానంలో గత పక్షం రోజులుగా నిర్వహిస్తున్న ఐపీఎల్ క్రికెట్ పోటీలు శుక్రవారంతో ముగిసినట్లు నిర్వాహకులు చౌహాన్ సాయిరాం, మణితేజలు తెలిపారు. గత మూడేళ్లుగా ఈ పోటీలు రసవత్తరంగా కొనసాగుతున్నాయన్నారు. సీజన్ త్రీలో గెలుపొందిన జట్లకు బహుమతులతో పాటు నగదును అందజేశారు. మొదటి బహుమతి కొల్‌కత్తా నైట్ రైడర్స్ గెలుపొందగా రూ.20వేల ప్రైజ్‌మనీ గెలుచుకోగా.. రెండవ బహుమతి ముంబాయ్ ఇండియన్స్ గెలుపొందగా రూ.15 వేల ప్రైజ్‌మనీ గెలుచుకున్నారు. మూడవ బహుమతి చెన్నై సూపర్ కింగ్స్ రూ.10వేల ప్రైజ్‌మనీని గెలుచుకున్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

- మంత్రి సీతక్క
- మంచిర్యాల జిల్లాలో ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు, అధికారులతో సమావేశం
- పాల్గొన్న జిల్లా కలెక్టర్ రాజర్షి షా

ఆదిలాబాద్ అర్బన్, మే 31(ఆంధ్రజ్యోతి): నకిలీ విత్తనాలు జిల్లాలో ఎవరైనా విక్రయిస్తే కఠిన చర్యలు చేపట్టాలని ఈ విషయంలో ఉపేక్షించేది లేదని రాష్ట్ర మంత్రి సీతక్క అన్నారు. శనివారం మంచిర్యాల జిల్లాలో ఉమ్మడి జిల్లా కలెక్టర్లు, అధికారులతో జిల్లాస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. దీనికి జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా నుంచి కలెక్టర్ రాజర్షిషా సమావేశంలో పాల్గొని మంత్రికి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి పనులు, పథకాల అమలును ప్రాజెక్టర్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ఈసారి వానాకాలం సీజన్ 15 రోజుల ముందే ప్రారంభమైందని అందుకు తగ్గట్టుగా ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఉమ్మడి జిల్లాలో నకిలీ విత్తనాలు రాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాకు సరిపడా విత్తనాలను అందుబాటులో ఉంచాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. భూభారతిలో చేపడుతున్న రెవెన్యూ సదస్సులు జూన్ 3 నుంచి 20 వరకు అన్ని మండలాల్లో నిర్వహించాలని సూచించారు. అలాగే జూన్ 12నుంచి పాఠశాలలు పునః ప్రారంభంకానున్న సందర్భంగా పాఠశాలల ఆవరణలో, అన్ని గదులు శుభ్రం చేయాలన్నారు. పాఠశాలలు ప్రారంభానికి మూడు రోజుల ముందు శుభ్రం చేయించాలన్నారు. చిన్నారుల భవిష్యత్తు అంగన్‌వాడీ టీచర్ల చేతుల్లో ఉందని వారి ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మహిళ శిశు సంక్షేమ శాఖ ద్వారా అందిస్తున్న పౌష్టికాహారం ప్రతీ చిన్నారులకు, గర్భిణీ, బాలింతలకు చేరువవ్వాలని అన్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలను కోటీశ్వరులు చేయాలని ప్రభుత్వ ధృడ సంకల్పాన్ని నెరవేర్చే దిశగా అన్ని రంగాల్లో మహిళలను భాగస్వాములను చేసి జిల్లాను రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దాలని మంత్రి కోరారు. ఈ సమావేశంలో మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్‌దీపక్, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేశ్‌దొత్రే, నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష, ఎమ్మెల్సీ దండెవిఠల్, కొమురయ్య, అభినవ్, శాసనసభ్యులు ప్రేమ్‌సాగర్‌రావు, గడ్డం వినోద్, రామారావ్‌పటేల్, జీసీసీ కోట్నాక్ తిరుపతి, ఐటీడీఏ పీవో ఖుష్బు గుప్తా,సబ్ కలెక్టర్ యువరాజ్, ఆసిఫాబాద్ అడిషనల్ కలెక్టర్ సంబంధిత ఆయా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



జిల్లా కలెక్టర్ రాజర్షిషాను సన్మానిస్తున్న మంత్రి సీతక్క

పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలి

- దంత వైద్య శిబిరంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్ అర్బన్, మే 31(ఆంధ్రజ్యోతి): ప్రజలు పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ అన్నారు. ప్రపంచ పొగాకు నిరోధక దినోత్సవం సందర్భంగా ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పోలీసులు, వారి కుటుంబ సభ్యుల కోసం ఉచితంగా దంత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శనివారం ఏఆర్ హెడ్ క్వార్టర్‌లో నిర్వహించిన శిబిరాన్ని ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.అనంతరం వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న తీరును పరిశీలించి అసోసియేషన్ సభ్యులను అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ టోబాకో వల్ల జీవితాలు నాశనం అవుతాయని, టోబాకో, వాటి ఉత్పత్తుల వినియోగం వల్ల క్యాన్సర్, గుండెపోటు, శ్వాసకోశ వ్యాధులకు కారణమవుతాయన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి.సురేందర్‌రావు,డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి, సీఐలు బి.సునిల్ కుమార్, సీహెచ్ కరుణాకర్‌రావు, కె.ఫణిదర్, రిజర్వ్ ఇన్స్‌పెక్టర్లు వెంకటి, మురళి, చంద్రశేఖర్, ఇండియన్ డెంటల్ అసోసియేషన్ అధ్యక్షుడు సాయిరామ్, ప్రధాన కార్యదర్శి చిన్మయివాజే, సంజీవ్, దీపికా, అమూల్య, భావన, కావ్యనాయక్, ఆనంద్, సమియుద్దీన్, విశాల్ ఆడే, నిఖిల్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, అరుణ్, రాహుల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

- ఉద్యోగ విరమణ తర్వాత ఆరోగ్యంపై దృష్టి సారించాలి

ఆదిలాబాద్, మే 31(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ విరమణ పొందిన అనంతరం ఉద్యోగులు తమ ఆరోగ్యంపై ప్రత్యేకదృష్టిని సారించాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. శనివారం జిల్లా హెడ్‌క్వాటర్‌లో కుటుంబ సభ్యులతో కలిసి ఉద్యోగ విరమణ పొందిన అధికారులను శాలువాతో సన్మానిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 42 ఏళ్ల పాటు పోలీసు శాఖలో సేవలందించిన ఇద్దరు ఏఆర్ ఎస్సైల సేవలకు రాష్ట్ర ప్రభుత్వం గతంలో సేవా పథకాలను అందించిందన్నారు. శాంతి భద్రతల విషయంలో తమవంతు పాత్ర పోషించిన ఇద్దరు ఏఆర్ ఎస్సైలు భీంరావ్, జే.గౌరయ్యలను అభినందించారు. సంఘవిద్రోహ శక్తులతో పోరాడి జిల్లాలో ప్రశాంత వాతావరణాన్ని నెలకొల్పేందుకు కృషి చేశారన్నారు.



దంత శిబిరంలో వైద్యులతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ



అసంపూర్తి బ్రిడ్జిలతో ఖరీఫ్ పనులు కొనసాగేదెలా?

- బేల మండలంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలు
- గ్రామాల్లో చెరువులను తలపిస్తున్న పంటపొలాలు

- నత్తనడకన కొనసాగుతున్న బ్రిడ్జి నిర్మాణ పనులు

7లో